ఇంటర్వ్యూహం

ఎ. యస్. రావ్

చేతికి అతుక్కున్న ఎలక్ట్రానిక్ వాచ్‌ని వోసారి చూసి, అతను తీరుబడిగా సిగరెట్ వెలిగించాడు. ఇంకా తీరుబడిగా గోడకి వీపు ఆన్చి యేటవాలుగా నిలబడ్డాడు.

తన అంచనా నిజమైతే, సిగరెట్ పూర్తయ్యేసరికి ఆ వ్యక్తి ప్రత్యక్షమవుతాడు. టెలిఫోన్‌లో మాట్లాడినప్పుడు ఆ వ్యక్తి కంఠంలో ఆశ్చర్యం, అపనమ్మకం ధ్వనించాయి. ఆ రెండింటి మధ్యా, రెండింటిని మింగేస్తూ ఆశ కూడా లీలగా ధ్వనించింది. ఎదుటివ్యక్తి కళ్ళలోని, కంఠంలోని ఆశని తన కళ్ళూ, చెవులూ ఇట్టే కనిపెట్టేస్తాయి. తనలోని ఆశక్తే తన చేతిలోని ఆయుధం!

సగర్వంగా నవ్వుకుంటూ అతను సిగరెట్ పొగని తృప్తికరంగా ఊపిరితిత్తుల్లోకి సరఫరా చేశాడు. మరో రెండు, మూడు దమ్ముల్లో అతను లిఫ్ట్‌లోంచి దిగాలి; తన అంచనా నిజమవుతే. మనుషుల విషయంలో తన అంచనా ఎప్పుడూ నిజం అవుతూనే వుంటుంది....

చిన్నగా చప్పుడు చేసిన లిఫ్ట్‌వైపు అతను మెరిసే కళ్ళతో చూశాడు. తన అంచనాని నిజం చేయడానికే అన్నట్టు ప్రత్యక్షమైన ఆ వ్యక్తిని అతను సిగరెట్ పొగ తెరలోంచీ చూస్తూ వుండిపోయాడు.

బట్టతల, వెడల్పాటి మొహం, నలుపూ, తెలుపూ కలిసిన గుబురు కనుబొమలకింద విశ్రాంతి లేకుండా అటూ ఇటూ చూసే చిన్న కళ్ళు. ఒదులుగా వున్న పొట్టి చేతుల చొక్కా ఒదులుగావున్న పాంటులోకి మారింది. సన్నటి, రంగు వెలిసిపోయిన బెల్టు అతని బొజ్జని చుట్టుకుంది. గదుల నెంబర్లు చూసుకుంటూ అతను మలుపు తిరిగాడు.

జార్లబడిన గోడనుంచీ కదిలి అతను నిటారుగా నించున్నాడు. సిగరెట్టు పీకని కరండా మూలకు విసిరి, పెద్ద పెద్ద అంగల్తో కదిలాడు. ఆ వ్యక్తి కొంచెం దూరంలో వున్న గదిముందు ఆగి, బెల్ నొక్కడానికి చేతిని పైకెత్తాడు.

“బెల్ నొక్కకండి. నేను తాళం తీస్తేగానీ తలుపు తెరుచుకోదు!”

బట్టతల వ్యక్తి ఉలిక్కిపడి వెనక్కు తిరిగాడు. తన దగ్గరగా, ఎత్తుగా నించున్న వ్యక్తిని యెగాదిగా చూశాడు. తెల్లటి టైట్ పాంటు, బ్రౌన్ కలర్ ఫుల్ స్వెటర్, మెడ చుట్టూ తెల్లటి మఫ్లర్.... స్వెటర్ చేతులు మోచేతులదాకా నిర్లక్ష్యంగా పైకి తోయబడ్డాయి.

“మిస్టర్....” బట్టతల వ్యక్తి పల్చటి పెదవులు కదిలాయి.

“లోపలికెళ్ళి, హాయిగా కూచుని, తీరిగ్గా మాట్లాడు

కుందాం!" అంటూ అతను తాళం తెరిచి, డోర్ని లోప లికి తోశాడు.

"గెటిన్, మిస్టర్ ప్రాణేశరావ్!"

బట్టతల వ్యక్తి లోపలికి జరిగాడు. క్షణంలో లోప ల్నుంచీ తలుపు మూసి, తాళంవేసి, తాళంచెవిని పాంటు జేబులో దోపుతని అతను ప్రాణేశరావుని చిరునవ్వుతో చూశాడు,

"మధ్యాహ్నం ఫోన్ చేస్త మీరేనా?" ప్రాణేశ రావు అతన్ని మళ్ళీ ఎగాదిగా చూస్తూ అడిగాడు.

"నేనే. వచ్చినందుకు థాంక్స్. కూచోండి!"అంటూ అతను సోఫావైపు కదిలాడు. తన ఆకారం, తీవి ప్రాణేశ రావుకి బాగా నచ్చినట్టు అతను చటికెలో గ్రహిం చాడు. అయితే, తన పర్సనాలిటీ నచ్చినందుకు ప్రాణేశ రావు త్వరలో నిరాశతో విచారిస్తాడు. అతనికి నచ్చా ల్సింది తన పర్సనాలటీ కాదు; తన ప్లాన్.

"ఫోన్లో మీ పేరు చెప్పలేదు...." సోఫాలో విశాలంగా కూచున్న ప్రాణేశరావు నవ్వే ప్రయత్నం చేస్తూ అన్నాడు.

"మిస్టర్ ప్రాణేశరావ్, అయామ్ మహాబలేశ్వ రావ్...." అంటూ అతను సోఫాలో కూచున్నాడు.

ప్రాణేశరావు కనుబొమలు ఒకదాన్నొకటి గొంగళి పురుగుల్లా తాకి, దూరంగా జరిగాయి. "మా విషయం మీ కెవరు చెప్పారు?"

"అదో పెద్ద కథ!" మహాబలేశ్వరావు నవ్వుతూ అన్నాడు.

"ఫోన్లో మీరు చెప్పిన అబ్బాయి—అదే, వరుడు— మీ రేనా?" ప్రాణేశరావు తనని తొందరపెడుతున్న

ప్రశ్నని అడిగాడు.

"కాదు...."

"అతను....మీ కేమవుతాడు?"

"ఏమీ కాడు!"

ప్రాణేశరావు కనుబొమలు మళ్ళీ వ్యాయామం ప్రారంభించాయి. మహాబలేశ్వర్రావు అతన్ని సూటిగా చూశాడు. సోఫాలో ముందుకి జరిగాడు. "మిస్టర్ ప్రాణేశరావ్, నేను ఫోన్‌లో చెప్పిందంతా మరిచి పొండి. మొదట్లోనే మీరు నిజం తెలుసుకోవడం మంచిది. మీ అయిదో కూతురి పెళ్ళి విషయం గురించి నేను మాట్లాడను. అయితే, నేను మాట్లాడితే, ఆ మాటల్ని చెవులప్పగించి మీరు వింటే, మీ అమ్మాయి పెళ్ళికి అవి కొంతవరకూ ఉపయోగించే అవకాశం వుంది..."

"వాట్....డూ....మీన్?" ప్రాణేశరావు కంఠంలో ఆశ్చర్యం గంటలా పలికింది.

"మీ అమ్మాయి పెళ్ళి చేయాలంటే మీకు డబ్బు కావాలి. నేను మీకు కొంత డబ్బిస్తాను. ఇల్లు కట్టడానికి ఇటుకలా ఆ పైకం మీ అమ్మాయి పెళ్ళి సందర్భంలో మీకు ఉపయోగిస్తుంది...."

"ఏమిటిదంతా....? యింతకీ మీ రెవరు....? పొద్దుట...."

"'పొద్దుట' పొద్దుటే పోయింది. ఇది సాయంత్రం!" మహాబలేశ్వర్రావు నవ్వుతూ అన్నాడు. "అయితే, మీరు కట్టబోయే ఇంటికి నేను ఇటుక యివ్వాలంటే, మీరు నాకో సహాయం చేయాలి....ప్రతిఫలంగా!"

"మహాబలేశ్వర్రావు .. మహాబలేశ్వర్రావు, ఈ పేరు

వినగానే నాకు అనుమానం వేసింది. అయినా ఒకే పేరు మరో వ్యక్తికికూడా వుండొచ్చనుకున్నా....ఇప్పుడు నాకు అర్ధమవుతోంది. నీకు మా కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది. అవునా?" ప్రాణేశరావు అప్రయత్నంగా ఏకవచనంలోకి దిగి, అన్నాడు.

"మీ జ్ఞాపకశక్తికి జోహార్లు!" మహాబలేశ్వర్రావు నవ్వుతూ అన్నాడు. "మీరు ఊహించి, అనుమానిస్తారన్న అనుమానంతో ఫోన్‌లో నేను పేరు చెప్పలేదు!...."

"నా కూతురి పెళ్ళికి—అదే నేను కట్టబోయే ఇంటికి ఇటుక యివ్వాలంటే, నీకు నేను మా ఎస్టాబ్లిష్‌మెంట్లో ఉద్యోగం ఇప్పించాలి! అంతేగా?" ప్రాణేశరావు తీక్షణంగా చూస్తూ గంభీరంగా అన్నాడు.

"మిస్టర్ ప్రాణేశరావ్...."

"షటప్!" ప్రాణేశరావు గద్దిస్తూ ఒక్క ఉదుటున లేచి నిలబడ్డాడు. నిప్పులు కక్కే కళ్ళతో మహాబలేశ్వర్రావుని చూశాడు. "ఎంత ధైర్యం! ఎంత అహంకారం! ఐ విల్ సీ దట్ యూ ఆర్...."

"హోల్డాన్!" మహాబలేశ్వర్రావు అతని చూపుల్ని యెదుర్కొంటూ బిగ్గరగా అన్నాడు. "మిమ్మల్ని వుద్యోగం యిప్పించమని అడుగుతానని మీరెలా అనుకున్నారు? ఈ ఉద్యోగం ఎవరికిగానీ యిప్పించే శక్తి మీకు లేదు!" శివుడి మెడలో నిద్రిస్తూ వేలాడే పాములా తన మెడమీంచి వేళ్ళాడుతున్న మఫ్లర్ని అతను రెండు చేతుల్లో బిగించాడు.

"వాడ్డూయూ మీన్?" ప్రాణేశరావు అర్ధంకానట్టు చూస్తూ అరిచాడు.

"కన్సాలిడేటెడ్, డెయిలీ వేజ్, ఎన్.ఎమ్.ఆర్. పద్ధతులమీద అమాయకులకి 'అడపాదడపా ఫ్యాక్టరీలో చౌకబారు ఉద్యోగాలు యేర్పాటుచేసే ఒక మోస్తరు శక్తి మీలో వుంది. అయితే, ఆ ఉద్యోగాల కోసం వచ్చే బలిపశువులు ఎంతో కొంత చదివింపును చేస్తేగానీ మీలో ఆ 'శక్తి' మేల్కోక్కను!" మహాబలేశ్వర్రావు నవ్వుతూ అన్నాడు.

సోఫా ముందు లావుపాటి స్తంభంలా నించున్న ప్రాణేశరావు పిడికిళ్ళు బిగుసుకున్నాయి. అతని దవడలు అదిరాయి. "వాట్ డూ....యూ....మీన్?" బొంగురుగా అన్నాడతను.

"ఈ ఇంగ్లీషు ప్రశ్నని యిప్పటికే విసుగెత్తే అన్ని సార్లు విన్నాను! మీ గురించి నాకు తెలిసిన విషయాలు యితర్లకి, ముఖ్యంగా మీ ఫ్యాక్టరీ మేనేజ్‌మెంటుకి తెలీకుండా వుండాలంటే, నే నెందుకు మిమ్మల్ని ఇక్కడికి రప్పించానో వివరంగా తెలుసుకోవాలని వుంటే, శరీరాన్నీ నోటినీ అదుపులో పెట్టుకుని కూచోండి!" మహాబలేశ్వర్రావు నిర్లక్ష్యంగా అన్నాడు.

కళ్ళు చిట్లించి, అతని కళ్ళల్లోకే చూస్తోన్న ప్రాణేశరావు క్షణకాలం సందేహించి సోఫాలో కూలబడ్డాడు. "నేను అయిదు నిమిషాలు మాత్రం ఇక్కడుంటాను. అర్థమయ్యేలా మాట్లాడు!"

మహాబలేశ్వరరావు చిన్నగా నవ్వాడు. లంచాలు తీసుకుని మీరు వుద్యోగాలు—బొత్తిగా టెంపొరరీవి—ఇప్పించే విషయం గురించి నేను అన్నమాటలు అర్థమయ్యాయని, కూచుంటూ మీరు నిరూపించారు. మీ వెడల్పాటి మొహంమీదున్న పొడుగాటి ముక్కుకి

సూటిగా మీరు ఉద్యోగం చేయడం లేదని నాకు తెలుసు...."

"మహా....బలేశ్వర్రావ్....నువ్వు...."

"పొడుగాటి ముక్కుకి సూటిగా బతుకుతూ నలుగురు కూతుర్లకి చక్కటి సంబంధాల్ని చేయడం కూడా కష్టమనీ నాకు తెలుసు!" మహాబలేశ్వర్రావు అతన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా అన్నాడు. "బఫెలో ఫెర్టిలైజర్స్" సంస్థలో సీనియర్ ఉద్యోగి అయిన మీరు కేవలం జీవితంమీదనే ఆధారపడి పనిచేయడం లేదనీ నాకు తెలుసు! నలుగురు కూతుళ్ళ పెళ్ళిళ్ళకీ డబ్బు అందించిన మీ ప్రొప్రయిటర్ భావరాజు అయిదో కూతురి పెళ్ళికి అక్కరకురాని అణాకాసు యివ్వడనీ నాకు తెలుసు...."

"స్టాప్! స్టాప్ ది రబ్బిష్!" ప్రాణేశ్వర్రావు హుంకరించాడు.

మహాబలేశ్వర్రావు తటాలున పైకిలేచాడు. ముందుకు నడిచి ప్రాణేశ్వర్రావు ముందు ఠీవిగా నిలబడ్డాడు. అతని మొహంలోకి తదేకంగా చూశాడు.

"మీరు అప్పుల్లో వున్నారు. అయినా కూతురి పెళ్ళి ఆగడానికి లేదు. అంచేత మీకు డబ్బు అవసరం. ఆ అవసరాన్ని కొంతవరకూ నేను తీరుస్తాను...."

"నీ బోడిసహాయాన్ని నేను తీసుకోనంటె ఏం చేస్తావ్?" తన జాతకాన్ని సంపూర్ణంగా అప్పజెప్తున్న మహాబలేశ్వర్రావుమీద ఆగ్రహంతో, అవమానంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రాణేశ్వర్రావు హుంకరించాడు.

మహాబలేశ్వర్రావు చిన్నగా నవ్వాడు. "మిమ్మల్ని ఏమీ చేయను. తోకముడుచుకుని వెళ్ళిపోతాను. రెండ్రో

జాల్లో తాత్కాలిక వుద్యోగుల నియామకంలో మీరు లంచాలు కతికి మేనేజ్ మెంటుకి యెలా టోపీ వేశావో పూర్తి వివరాలతో ముఖ్యమైన వాళ్ళందరికీ రాతమూలకంగా తెలియజేస్తాను. ఆ ముఖ్యమైన వాళ్ళల్లో ఒక పత్రికా సంపాదకుడు కూడా వుంటాడు!"

ప్రాణేశరావు ఉక్కిరిబిక్కిరవుతూ, నమ్మలేనట్టు చూశాడు. అతని బట్టతలమీదా, నుదురుమీదా బొబ్బల్లా చెమట బిందువులు ప్రత్యక్షమయ్యాయి.

"నన్ను.... బెదిరిస్తున్నావా?" అతని బొంగురు కంఠంలో మేకపోతు గాంభీర్యం బలహీనంగా పలికింది.

"నేను ఊరికే బెదిరించే వ్యక్తి కానని నా కళ్ళు మీకు యిదివరకే చెప్పివుండాలి!" మహాబలేశ్వరరావు సగర్వంగా అన్నాడు.

ప్రాణేశరావు అప్రయత్నంగా నిట్టూర్చాడు. పొగ చూరిన అతని పెదాల్ని చూస్తూ మహాబలేశ్వరరావు సిగరెట్ పాకెట్ని అతని వొళ్ళోకి విసిరాడు. అప్రయత్నంగా ప్రాణేశరావు సిగరెట్ తీసి, వణుకుతున్న చేత్తో పెదాలమధ్య యిరికించాడు. మహాబలేశ్వరరావు లైటర్ క్లిక్ మనిపించి, మంటని అతని సిగరెట్ కొసకి తగిలించాడు.

పొగ ఊదుతూ, దగ్గి ప్రాణేశరావు అతన్ని అదోలా చూశాడు. అతని బుర్రలో కంప్యూటర్లు వేగంగా లెక్కలు వేస్తున్నాయని మహాబలేశ్వరరావుకి తెలుసు.

"ఆల్ రైట్....నువ్వు నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నావ్! నేను ఉద్యోగం ఇప్పించలేనన్నావ్. నేను నీకు చేయగలిగిన సాయం ఏమిటి అయితే?" ప్రాణేశరావు చివరికి ధైర్యంగా ప్రశ్నించాడు.

"ఇప్పటికి బండి పట్టాలమీదికి వచ్చింది!" మహా బలేశ్వర్రావు నవ్వుతూ అన్నాడు. అతని చెయ్యి పాంటు జేబులోకి పోయి ఇవతలికి వచ్చింది. మడతపెట్టిన కాగితాన్ని విదిల్చి, విడదీశాడతను. దాన్ని ప్రాణేశరావు మొహం ముందు పట్టుకున్నాడు.

"ఇది నాలుగురోజుల క్రితం మీరు సంతకంచేసి నాకు పంపిన ఇంటర్వ్యూ లెటర్, అవునా?"

కంపెనీ లెటర్ హెడ్‌మీద టైప్ చేసిన ఉత్తరాన్నీ తన సంతకాన్నీ జాగ్రత్తగా చూస్తూ ప్రాణేశరావు అప్రయత్నంగా తలాడించాడు.

"ఇలాంటి యింటర్వ్యూ ఉత్తరాలు యెంతమంది అభ్యర్థులకి పంపించారు?" మహాబలేశ్వర్రావు ప్రశ్నించాడు.

"ఎందుకు?" ప్రాణేశరావు అనుమానిస్తూ అన్నాడు.

"చెప్తాను. ఎంతమంది?"

"సుమారు ఓ ముప్పైమందికి పంపించాను..."

"మిస్టర్ ప్రాణేశరావ్, మీరు మీ సెక్షన్ నుంచీ ఫీల్డ్ ఆఫీసర్ వుద్యోగానికి యెవరెవరికి ఇలాంటి ఇంటర్వ్యూ వుత్తరాలు పంపించారో వాళ్ళందరి పేర్లూ, అడ్రెసులూ నాకు కావాలి...."

ప్రాణేశరావు కంగారుగా చూశాడు. "దే.. దేనికి?"

"ఆ ఉద్యోగం నాకు కావాలి" మహాబలేశ్వర్రావు స్పష్టంగా అన్నాడు.

ఆశ్చర్యంతో ప్రాణేశరావు నోరు తెరుచుకుంది. "నీకు వుద్యోగం కావాలంటే, నువ్వు వేరే ప్రయత్నం చేయాలి. కాండిడేట్స్ వివరాలు సంపాయించి ఏమీ చేయలేవు!"

మహాబలేశ్వర్రావు చిన్నగా నవ్వాడు. "ఎలా ప్రయత్నించాలో నాకు తెలుసు. ఆ లిస్టు నాకు కావాలి...."

"ఎందుకు? వివరంగా చెప్తేగానీ నేను ఏమీ చేయలేను!"

"మిస్టర్ ప్రాణేశ్వరావ్, బఫెలో ఫెర్టిలైజర్స్ ఫీల్డాఫీసర్ వుద్యోగానికి తొమ్మండుగుర్ని ఇంటర్వ్యూకి రమ్మన్నారు. ఇంటర్వ్యూకి నలుగురే వస్తే ఏం చేస్తారు?" మహాబలేశ్వర్రావు ప్రశ్నించాడు.

"వచ్చిన వాళ్ళలోంచే ఒకర్ని సెలెక్టు చేస్తారు...."

"ఒక్కడే వస్తే?" మహాబలేశ్వర్రావు అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"....అతన్నే సెలెక్టు చేస్తారు."

"ఆ ఇంటర్వ్యూకి జనవరి ఒకటో తేదీ నేను మాత్రం రావాలనుకుంటున్నాను."

ప్రాణేశ్వరావు వులిక్కిపడి, అయోమయంగా చూశాడు.

"అంటే...."

"అంటే, తతిమ్మా ఎనిమండుగురూ ఇంటర్వ్యూకి రాకుండా చూస్తాను!"

"వాళ్ళని....వాళ్ళని ఏం చేస్తావ్?" ప్రాణేశ్వరావు దిక్కుతోచని వాడిలా అడిగాడు. మహాబలేశ్వర్రావు వరస అతనికి మతిపోగొట్టేస్తోంది.

మహాబలేశ్వర్రావు పకపకా నవ్వాడు. "వాళ్ళని చంపను! మూడువేల రూపాయల జీతం యిచ్చే వుద్యోగం కోసం ఎనిమండుగురి ప్రాణాలు తీసేంతగా దేశంలో

పరిస్థితి దిగజారిపోలేదు!"

"నీ వాలకం చూస్తుంటే నువ్వు దిగజారిపోయా వేమో అనిపిస్తోంది!" నిస్సహాయస్థితిలో యిరుక్కున్న ప్రాణేశరావు ఉక్రోషంతో అన్నాడు.

మహాబలేశ్వరరావు చిన్నగా నవ్వాడు. "కంగారుపడకండి. నా తెలివితేటల్ని ఉపయోగించి వాళ్ళని ఆపుతాను. నేనొక్కడ్నే వస్తాను. అంతే!"

"యూ ఆర్ ఆస్కింగ్ ఫర్ టూ మచ్!"

"యూ ఆర్ రాంగ్, మిస్టర్ ప్రాణేశరావ్! మినిస్టర్ల సిఫార్సులూ, మంచి వుద్యోగాలకోసం కొన్ని సంవత్సరాల జీతాన్ని డిపాజిట్‌గా ఒకే ఇన్‌స్టాల్‌మెంట్‌లో చెల్లించే అభ్యర్థులూ, కమీషన్ వసూలు చేసుకుని బలహీనులకి చిల్లర ఉద్యోగాలిచ్చే మీలాంటి సెక్షన్ ఆఫీసర్లూ, ధనబలానికీ, భుజబలానికీ లొంగిపోయి గొప్ప గొప్ప అభ్యర్థులకి ఉద్యోగాలిచ్చే మీ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్లూ, మీ నాటకాల్ని కంఫర్టబుల్‌గా ఇగ్నోర్ చేస్తూ కోట్లకికోట్లు లాభాలు దోచుకునే ఫ్యాక్టరీ యజమానులూ—ఉన్నంత కాలం నా లాంటివాడు యిలాంటి కొత్త పద్ధతిని అనుసరించి తెలివిగా ఉద్యోగం సంపాయించాల్సిందే!" మహాబలేశ్వరరావు చిన్నగా ఉపన్యాసం ఇచ్చాడు.

ప్రాణేశరావు మూగవాడిలా కూచుని, జేబురుమాల్తో బట్టతలనీ, మొహాన్నీ తుడుచుకున్నాడు. దీనంగా మహాబలేశ్వరరావుని చూశాడు. "ఇంతకీ.... నన్నేం చేయమంటావు?"

మహాబలేశ్వరరావు చిరునవ్వు నవ్వుతూ సోఫాలో కూచున్నాడు. "చిన్న పని! ఇంటర్వ్యూ అభ్యర్థుల

లిస్టూ, ఇంటర్వ్యూ చేసే వ్యక్తుల లిస్టూ వాళ్ళ బయో డేటా వగైరా వివరాలు ఇస్తేచాలు. రేపు సాయంత్రం యిదే టైముకి యిక్కడే వుంటాను. తలుపు తాళం వేయను!"

"అదంతా మోస్టు కాన్ఫిడెన్షియల్ .... నా ఉద్యోగం ఊడిపోతుంది...." ప్రాణేశరావు మొహం తెల్లబార సాగింది.

"ఒప్పుకుంటాను. దీనంతా కాన్ఫిడెన్షియల్ గా వుంచకపోతే రేపొద్దున నాకు ఉద్యోగం రాదు. వచ్చినా మీ ఉద్యోగంలాగే ఊడిపోతుంది. నేను అడిగింది సప్లై చేయండి. నేనిచ్చేది తీసుకోండి. మరుక్షణం అంతా మరచిపోయి, అయిదో అల్లుడికోసం అన్వేషణ ప్రారంభించండి!" మహాబలేశ్వర్రావు నవ్వుతూ అన్నాడు.

ప్రాణేశరావు ఆరిపోయిన సిగరెట్ ని యాష్ట్రేలో నొక్కుతూ వుండిపోయాడు. మెల్లిగా తలెత్తి వెర్రివాడిలా మహాబలేశ్వర్రావుని చూశాడు. అతను నోటితో అడగలేని ప్రశ్నని అతని కళ్ళల్లో మహాబలేశ్వర్రావు చదువుతూ చిరునవ్వు నవ్వాడు.

మెల్లిగా పైకి లేచాడు. పాంటు జేబులోంచి వంద రూపాయలకట్టని ఇవతలికి లాగి ప్రాణేశరావు వొళ్ళో పడేశాడు. "అయిదువేలు. అడ్వాన్స్. నాకు రావాల్సింది యిచ్చాక మరో అయిదువేలు చెల్లించబడుతుంది...."

"చిన్న మొత్తానికి మరీ పెద్ద రిస్కు...." ప్రాణేశరావు నోట్లకట్టమీద అరచేతిని బోర్లిస్తూ అన్నాడు.

మహాబలేశ్వర్రావు అతని కళ్ళల్లోకి తదేకంగా చూశాడు. "మిస్టర్ ప్రాణేశరావ్, పైసా ఇవ్వకుండా,

ఆ మాటకొస్తే ఈ గది అద్దె మీ చేతే కట్టించి, ఆ వీధ రాల్ని ఊడబీక్కోగలను! నేను కాలు కదిపితే మీ ఆట కట్టవుతుంది! ఆరేళ్ళ క్రితం మీరు రోజువారీ జీతంమీద ఉద్యోగాల్లో పెట్టిన దుర్గయ్యా, మునీశ్వర్ వగైరా అయిదుగురు మీకు యెంతెంత ఇచ్చారో, తరువాత నెల నెలా ఎంతెంత ఇస్తున్నారో నాకు చెయ్యి కోసి రాసి సప్లై చేశారు!"

ప్రాణేశరావు పెదవులు గడగడ వణికాయి. "దొంగ ముండాకొడుకులు! అప్పుడు కాళ్ళు పట్టుకున్నారు. ఇప్పుడు ...."

"వాళ్ళమీద ఆగ్రహించి, ఆత్రపడి యేమీ చేయకండి. తరువాత విచారిస్తారు. దుర్గయ్య నాకు బావమరిది!" మహాబలేశ్వరరావు నవ్వుతూ అన్నాడు.

ప్రాణేశరావు కంగారుగా, ఆశ్చర్యంగా చూశాడు. మహాబలేశ్వరరావు చిన్నగా నవ్వాడు. "కేవలం పెళ్ళి కావాల్సిన మీ కూతురిని మనసులో వుంచుకుని యీ మొత్తం యిస్తున్నా. అది గుర్తుంచుకోండి!"

ప్రాణేశరావు మెల్లిగా లేచాడు. నోట్లకట్టని పాంటు జేబులోకి దోపుకున్నాడు. అదోలా మహాబలేశ్వరరావుని చూశాడు.

"మహాబలేశ్వరరావ్, నీకు పెళ్ళయిందా?" అతని కంఠంలో ఏదో ఆశ ప్రతిధ్వనించింది.

మహాబలేశ్వరరావు పక పక నవ్వుతూ వుండిపోయాడు. "అది మనకి అనవసరం! అయినా, నేను మీకు అల్లుడిగా పనికిరాను. నాది మీ తెగ కాదు!"

"ఐడోంట్ కేర్! ఎందుకో తెలీదుగానీ, అయామ్ బిగినింగ్ టూ లైక్ యూ...." ప్రాణేశరావు మెరిసే

కళ్ళతో చూశాడు.

"థాంక్యూ! అయితే రేపు సాయంత్రం జాతకాలు పట్టుకురండి; సంభావన పట్టుకెళ్ళండి!" మహాబలేశ్వరరావు నవ్వుతూ అన్నాడు....

2

అతను లోపలి గదిలో సోఫామీద ఠీవిగా కూచున్నాడు. ముందున్న టీపాయ్ మీద ఖరీదైన లెదర్ ఫోల్డర్ వుంది. దానిమీద 'బఫెలో ఫెర్టిలైజర్స్' అని ఇంగ్లీషులో బంగారం రంగులో ఎంబోస్ చేయబడింది. దాని పక్కనే కొన్ని కార్డుబోర్డు ఫైల్స్ ఒకదానిమీద ఒకటి పెట్టబడి వున్నాయి.

సిగరెట్ వెలిగించి, అతను లెదర్ ఫోల్డర్ని అందుకున్నాడు. పక్కనే సోఫామీద పరేసి, తెరిచి బఫెలో ఫెర్టిలైజర్స్ లెటర్ హెడ్ మీద ఎగ్జిక్యూటివ్ టైప్ లో టైప్ చేయబడిన ఉత్తరాన్ని చిరునవ్వుతో చదువుతూ వుండిపోయాడు.

కంపెనీ జనవరి ఒకటో తేదీ యేర్పాటుచేసిన ఇంటర్వ్యూకి ముందుగా, డిసెంబరు 31 నాడే కంపెనీ పబ్లిక్ రిలేషన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫీసర్ని హోటల్ లక్స్ లో ప్రిలిమినరీ ఇంటర్వ్యూ కోసం కలుసుకొమ్మని అభ్యర్థులకి రాసిన ఉత్తరం అది. ఎంతో చాకచక్యంగా వ్యవహరించి తను తయారుచేసుకున్న పథకం ప్రకారం అంతా సవ్యంగా జరిగింది. ఎనమండుగురు అభ్యర్థులూ ఠంచన్ గా వచ్చేశారు. ముందుగదిలో కూచున్న వాళ్ళలో ఏ విధమైన ఆలోచనలు సాగుతున్నాయో వూహించడానికి ప్రయత్నిస్తూ మహాబలేశ్వరరావు చిరునవ్వు నవ్వుకున్నాడు.

కంపెనీ ఉత్తరం కింద వరుసగా వున్న ఎనమండు

గురు అభ్యర్థుల పేర్లనీ అతను ఒకసారి లోపలే చదువుకున్నాడు. ఫోల్డర్‌ని చేత్తో పట్టుకుని పైకి లేచాడు. ఠీవిగా నడుస్తూ అద్దం ముందు ఆగాడు. సరికొత్త సూటులో దర్జాగా అవుపిస్తున్న ప్రతిబింబాన్ని తృప్తికరంగా చూసుకున్నాడు. తను బఫెలో ఫెర్టిలైజర్స్ ప్రొప్రయిటర్ అని చెప్పుకున్నా కూడా వాళ్ళు నమ్మేస్తారు. అంత హుందాగా వున్నాడు తను! ముక్కు కొనమీద వులిపిరికాయా, చెవుల్ని కప్పిన క్రాపూ, రిమ్‌లెస్ కళ్ళద్దాలూ, వెడల్పాటి మీసాలూ తన అసలు రూపాన్ని చక్కగా దాచేశాయి...

అద్దం ముందునుంచీ గిరుక్కున వెనక్కి తిరిగి మహాబలేశ్వర్రావు గుమ్మంవైపు నడిచాడు. తలుపు తెరిచి, కర్టెన్ని తోసుకుని స్టేజిమీదికి ప్రవేశిస్తున్న ఫేమస్ యాక్టర్లా ముందు గదిలోకి ప్రవేశించాడు.

కుర్చీల్లో కూచున్న ఎనమండుగురు యువకులు అదరా బాదరా లేచినించున్నారు. బంగారం రంగులోని అక్షరాలు వాళ్ళకి అవుపించేలా అతను లెదర్ ఫోల్డర్ని తన ఛాతీకి ఆన్చి పట్టుకున్నాడు. భయభక్తులతో తనని చూస్తోన్న యువకుల్ని పరిశీలనగా చూస్తూ కాసేపు మౌనంగా వుండిపోయాడు.

"మీరంతా ఈ ప్రిలిమినరీ ఇంటర్‌వ్యూకి వచ్చినందుకు సంతోషిస్తున్నా. అయామ్ ప్రాణేశరావ్" మహాబలేశ్వర్రావు కంఠం గంభీరంగా ధ్వనించింది. ప్రాణేశరావు పేరును వుపయోగించుకొంటున్నందుకు లోపల్లోపలే నవ్వుకుంటూ అతను వినయంగా కదుల్తున్న ఎనిమిదిమంది తలల్నీ తృప్తికరంగా చూశాడు.

"ఈ రోజుల్లో ఇంటర్‌వ్యూలు ఎంత ఫార్సుగా తయా

రయ్యాయో మీకు తెలుసు. ముందే టెలిఫోన్ల ద్వారా ఎవడో అభ్యర్థిని సెలెక్టు చేసేసుకుని, పబ్లిసిటీకోసం నామ మాత్రం ఇంటర్వ్యూ జరిపి చేతులు కడుక్కునే దరిద్రపు పద్ధతి ఎక్కువగా అమలులో వుంది....” మహాబలేశ్వరరావు ఆగాడు. పదహారు కళ్ళు ఉద్రేకంతో అతన్ని చూస్తున్నాయి.

“ఫైనల్ సెలెక్షన్లో, అవకతవకలు జరగడానికి వీల్లేకుండా అభ్యర్థుల్ని నిజాయితీతో పరిశీలించే ఉద్దేశంతో కంపెనీ పి.ఆర్.ఓ. అండ్ వెల్‌ఫేర్ ఆఫీసర్ హోదాలో నేను ఈ ప్రిలిమినరీ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నా....” మహాబలేశ్వరరావు వాళ్ళను తదేకంగా చూస్తూ ఆగాడు. తన ప్రకటన అయిదుగురి మొహాలకి రిలీఫ్‌నీ, ముగ్గురి మొహాలకి అర్థంకాని నిరుత్సాహాన్ని పూసినట్టు అతను గ్రహించాడు.

“అభ్యర్థులకీ, సంస్థకీ మేలుచేసే ఉద్దేశంతో జరుగుతున్న ఈ ఇంటర్వ్యూల గురించి రేపు జరిగే ఇంటర్వ్యూలో పాల్గొనే సెలెక్షన్ బోర్డు సభ్యులకి బొత్తిగా తెలీదు. తెలిస్తే మీకు న్యాయం జరగదు!” మహాబలేశ్వరరావు నవ్వుతూ అన్నాడు.

అయిదుగురు అమాయకంగా, ముగ్గురు ఒక్కరకం ఆందోళనగా తనవేపు చూడ్డం అతను తృప్తికరంగా గమనించాడు. తను చాకచక్యంగా, సులభంగా ఎనిమిదిమందిని రెండు గ్రూపులుగా విభజించగలిగాడు.

“ఈ క్షణంలో మీకో సలహా ఇస్తున్నా! హోటల్ లక్స్, రూమ్ సిక్స్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్వ్యూ గురించి మీరు యెలాంటి పరిస్థితిలో యెవ్వరికీ చెప్పకూడదు! ఈ క్షణం నుంచీ కంపెనీ కళ్ళు మీ మీదే

వుంటాయి. ఈ కాన్ఫిడెన్స్ని యే మాత్రం భంగం చేసినా ఫైనల్ సెలెక్షన్లో అది మిమ్మల్ని డిస్క్వాలిఫై చేస్తుంది! అందుకే మొదటి ఇంటర్వ్యూ గురించి అతి రహస్యంగా వుంచమని మీకు రాయడం జరిగింది. ఈ పాయింట్ మీ కందరికీ క్లియర్గా అర్ధమైందనుకుంటుంటాను...." మహాబలేశ్వర్రావు ఆగి, ప్రశ్నార్థకంగా చూశాడు.

"అర్ధమైంది సార్ ...." ఎనిమిది కంఠాలు బృంద గానం లెవెల్లో అన్నాయి.

"రైట్....నాతోపాటు అందరూ లోపలికి రండి. అక్కడున్న ఫైల్సుని తలా ఒకటి తీసుకోండి. అందులో మీ గురించిన వివరాలున్నాయి. రెండో పేజీలో ఒక ప్రశ్నావళి వుంది. ఆ ప్రశ్నలు మీకు కొత్తగా అనిపిస్తాయి. కంగారుపడకండి. సాధారణంగా యెవ్వరూ, ఇంటర్వ్యూల్లో అడగకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసే, అతి సాధారణమైన వివరాలు అడగబడ్డాయి. నిజాయితీగా నిర్భయంగా వాటికి సమాధానాలు రాయండి. మీరు సమాధానం రాయలేని ప్రశ్న అందులో లేదు! మీ గురించి మేం కనిపెట్టిన విషయాలతో మీరు స్వయంగా ఇచ్చే సమాధానాలు పోల్చిచూడబడతాయి. అంచేత— బీ ఫ్రాంక్ అండ్ ఫియర్లెస్!"

ఉపన్యాసం ముగించి మహాబలేశ్వర్రావు వెనుదిరిగి డోర్ను తోసి పట్టుకున్నాడు. అతని సైగతో అభ్యర్థులంతా ఏ.సి. గదిలోకి మారారు. లోపలికి జరిగి, మహాబలేశ్వర్రావు ఠీవిగా సోఫావైపు నడిచాడు. కూచుని పక్కనేవున్న ఫైళ్ళని అందుకున్నాడు.

"నాగేంద్ర!" ఫైలువేపు చూడకుండా పిలిచాడతను.

ఒక యువకుడు దగ్గరగా జరిగి ఫైలుని అందుకున్నాడు. ఫైలుమీద అతని పేరులేదు.

ఫైళ్ళవైపు చూడకుండా మహాబలేశ్వర్రావు వరసగా పేర్లు పిలిచాడు. ఒకదాని తరువాత ఒకటిగా వరుసగా ఫైల్స్ని అందించాడు. వరసగా తమ పేర్లని గుర్తుంచుకుని తమకి సంబంధించిన ఫైల్స్ని పొరపాటు లేకుండా అందిస్తున్న బఫెలో ఫెర్టిలైజర్స్ ఆఫీసర్ని అభ్యర్థులు భయాభక్తులతో చూస్తూ నించున్నారు. తమను గురించి తమకన్నా అతనికి అధికంగా తెలుసన్న భావం వాళ్ళ మొహాలమీద ప్రత్యక్షమైంది.

"గోడవారగా వున్న కుర్చీల్లో వరసగా కూచోండి. ప్రశ్నలకి సమాధానం రాయండి. యూ కెన్ హేవ్ ఫిఫ్టీన్ మినిట్స్!" మహాబలేశ్వర్రావు నవ్వుతూ అన్నాడు.

అందరూ ఆదరాబాదరా కుర్చీలవైపు కదిలారు. ప్రియశిష్యుల్ని చూస్తున్న గురువులా వాళ్ళని చిరునవ్వుతో చూస్తూ మహాబలేశ్వర్రావు సిగరెట్ వెలిగించాడు....

* * *

పదిహేను నిమిషాలు గడిచాయి. అభ్యర్థులు అందించిన ఎనిమిది ఫైళ్ళనీ తన పక్కనే పెట్టుకున్న మహాబలేశ్వర్రావు, తన రూంకు తొమ్మిది కప్పుల స్ట్రాంగ్ టీ పంపించమని రిసెప్షన్కి ఆర్డరిచ్చాడు.

"మీరంతా ముందు గదిలో కూచోండి. టీ వస్తుంది. తాగండి. తరువాత ఒక్కొక్కర్నే పిలుస్తాను...." అన్నాడతను అధికారం ధ్వనించే కంఠంతో.

బఫెలో ఫెర్టిలైజర్స్ ఫీల్డాఫీసర్ ఉద్యోగానికి అప్లై

చేసిన యువకులు బర్రెల మందలా గుమ్మంవైపు కది లారు....

మొదటి ఫైలుని తెరిచాడు మహాబలేశ్వర్రావు. అభ్యర్ధి అమాయకంగా, నిజాయితీగా రాసిన సమాధా నాలు అతని పెదవుల్ని చిరునవ్వుతో విడదీస్తున్నాయి.

తలుపు చప్పుడయింది. టీ కప్పుతో సర్వర్ లోపలి కొస్తున్నాడు. కాస్సేపట్లో యూనుకుంటూ తలుపు చిన్నగా చప్పుడు చేసింది. ముందున్న టీ కప్పు అందుకుని మెల్లగా చప్పరిస్తూ మహాబలేశ్వర్రావు ఫైల్సు తిరగేస్తూ వుండిపోయాడు....

మరో పదిహేను నిమిషాలు గడిచాయి. ఎనిమిది ఫైళ్ళనీ కొత్త వరుసలో సర్ది, పక్కన పడేసి మహా బలేశ్వర్రావు గుమ్మంవైపు నడిచాడు. తలుపు లాగి ముందు గదిలోకి తొంగి చూశాడు. తగ్గు స్వరాల్తో ఏదో చెప్పుకుంటున్న యువకులు ఆదరాబాదరా నించున్నారు.

"డియర్ కాండిడేట్స్, ఇప్పుడు సరికొత్త ఆర్డర్లో మీ పేర్లు పిలుస్తాను. ఆ క్రమంలో మీరంతా కుర్చీల్లో మారి కూచోండి. మొదటి అభ్యర్ధి మొదట గదిలోకి వస్తాడు. పదినిమిషాల్లో ఇంటర్వ్యూ ముగిస్తాను. అతను తిరిగిరాగానే రెండో వ్యక్తి, అతను తిరిగిరాగానే తర వాతి వ్యక్తి... ఇలా మీరు లోపలికి రావాలి...." మహా బలేశ్వర్రావు ఆగాడు.

సమాధానాలు రాశాక తను ఫైళ్ళని అరేంజ్ చేసిన క్రమంలో వాళ్ళ ఎనమండుగురి పేర్లనీ గంభీరమైన కం ఠంతో చకచకా పిలవసాగేడు. కొత్తక్రమంలో వాళ్ళ పేర్లని గుర్తుంచుకున్నందుకు అతను తనని తనే అభినం దించుకున్నాడు.

కాసేపట్లో అభ్యర్థులు అదే క్రమంలో కుర్చీల్లో కూచున్నారు. మొట్టమొదట పరిచయం చేస్తూ వాళ్ళ మొహాల్లో అవుపించిన రియాక్షన్ నిబట్టి రెండు గ్రూపులుగా తను విభజించిన క్రమంలో వాళ్ళు యిప్పుడు వున్నందుకు మహాబలేశ్వర్రావు లోపల్లోపలే సంతోషించాడు. ఒక గ్రూపులోని అయిదుగురూ ముందున్నారు. రెండో గ్రూపుకి చెందిన ముగ్గురూ చివరున్నారు. ఇప్పుడు తను అరేంజి చేసిన క్రమం చివరి ముగ్గురి మొహాలకీ మరో కొత్త రంగు పులిమినట్టు మహాబలేశ్వర్రావు గ్రహించాడు. తన అంచనా నిజం కాబోతోంది....

"రామసీతారావు...." అంటూ మహాబలేశ్వర్రావు తలుపును వదిలేసి లోపలికి తిరిగాడు. చకచకా నడిచి సోఫాలో వుందాగా కూచుని వెనక్కి వాలాడు.

మూసుకున్న తలుపు ముందు నిలబడ్డ మొదటి వ్యక్తి రామసీతారావు బెరుగ్గా చూశాడు. మెల్లగా అడుగు లేస్తూ మహాబలేశ్వర్రావు ముందు ఆగాడు.

"మిస్టర్ రామసీతారావ్, ఇంతవరకూ మీ ద్వారా తెలుసుకోని కొన్ని విషయాలు యిప్పుడు మీ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తాను...." అంటూ మహాబలేశ్వర్రావు ఆగాడు.

ఇంటర్వ్యూ అధికారి ఏమడుగుతాడో బొత్తిగా అంతుబట్టని రామసీతారావు ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు.

"ఆ టేబుల్ మీద టేప్ రికార్డర్ వుంది. దాన్ని ఆన్ చేసి తలుపు దగ్గరగా, గోడవారగా పెట్టండి!" మహాబలేశ్వర్రావు ఉత్తరువిచ్చాడు.

రామసీతారావు అయోమయంగా చూశాడు. మహా

బలేశ్వర్రావు చిరునవ్వుతో చూశాడు. "కంగారు పడకండి. రవిశంకర్ సితార్ కాసెట్ అందులో ఉంది. నేను మిమ్మల్ని అడిగే ప్రశ్నలూ, మీరు చెప్పే జవాబులూ అటువేపున వున్న మన మిత్రులు వినకూడదు!"

అర్థమైనట్టు అప్రయత్నంగా రామసీతారావు బుర్ర ఆడించాడు. ఉషారుగా కదిలి, టేప్ రికార్డర్ని గోడవారగా పెట్టి ఆన్ చేశాడు. అంతకుముందే మహాబలేశ్వర్రావు ఫిక్స్ చేసి వుంచిన వాల్యూంలో పండిట్ రవిశంకర్ సితార్ని పలికించడం ప్రారంభించాడు.

రామసీతారావు గది వెడల్పును కొలుస్తున్నవాడిలా మహాబలేశ్వర్రావు ముందుకు నడిచాడు.

"సిట్ డౌన్ అండ్ రిలాక్స్!" మహాబలేశ్వర్రావు గంభీరంగా అన్నాడు.

సోఫా అంచుమీద జాగర్తగా కూచుని, రామసీతారావు అతని వైపు సాభిప్రాయంగా, వినయంగా చూశాడు.

అతని పేరున్న ఫైల్ని తొడమీద పెట్టుకుని, మహాబలేశ్వర్రావు కోటుజేబులోంచి గైడర్ పెన్ తీశాడు. మెల్లిగా తలెత్తి రామసీతారావు మొహంలోకి తదేకంగా చూశాడు. మెల్లిగా అతని పెదవులు కదిలాయి.

మహాబలేశ్వర్రావు ప్రశ్నించడం ప్రారంభించాడు.

* * *

గంట పైగా గడిచింది. అయిదో అభ్యర్థిని ప్రశ్నించడం పూర్తిచేసి, మహాబలేశ్వర్రావు సిగరెట్ వెలిగించాడు. అతనిలో రకరకాల ఆలోచనలు పక్షిపిల్లల రెక్కల్లా రెపరెపలాడుతున్నాయి. అయిదుగురితో తను యేర్పాటుచేసిన మొదటి గ్రూప్ యింటర్వ్యూ పూర్త

యింది. రెండో గ్రూపుని తను చాకచక్యంగా, కొత్త రకంగా ఇంటర్వ్యూ చేయాలి. రెండో గ్రూపు ఇంటర్వ్యూ మీదే తన ప్లాను ఆధారపడి ఉంది....

మహాబలేశ్వర్రావు ముందు గదిలోకి ప్రవేశించాడు. స్వయంవరం సందర్భంలో యెవరో రాజకుమారి వేయబోయే పూలదండకోసం మెడలు చాపి కూచున్న రాజకుమారుల్లా యెనమండుగురు అభ్యర్థులూ కుర్చీల్లో కూచున్నారు.

“మీరు అయిదుగురూ, మీ గదులకి వెళ్ళొచ్చు. చాలా సేపట్నుంచీ అలసటగా అవుపిస్తున్నారు. రిసెప్షన్‌కి ఫోన్ చేసి టిఫిన్ తెప్పించుకు తినండి!” మహాబలేశ్వర్రావు నవ్వుతూ అన్నాడు.

ఐదుగురూ లేచినిలబడ్డారు. గుమ్మంవైపు కదిలారు.

“జస్ట్ మోమెంట్!” మహాబలేశ్వర్రావు కంఠం వాళ్ళని, తాడులా చుట్టి ఒకేసారి వెనక్కి తిప్పింది.

“జరిగిందాన్ని టాప్ సీక్రెట్‌గా వుంచుకోవాలని మీకు యిదివరకే సలహా ఇచ్చాను. సలహా పాటిస్తే మీకే మంచిది. నిర్లక్ష్యంచేస్తే మాకు మంచిది!” మహాబలేశ్వర్రావు నవ్వుతూ అన్నాడు.

ఐదుగురూ నవ్వే ప్రయత్నంచేసి, వోడిపోయి అర్థం కానట్టు చూశారు.

“మా సంస్థ కళ్ళూ, చెవులూ అనుక్షణం మిమ్మల్ని గమనిస్తూ ఉంటాయి. కాన్ఫిడెన్స్‌కి భంగం కలిగించిన వ్యక్తి రేపటి ఫైనల్ సెలెక్షన్‌లో ఆటోమాటిక్‌గా తనని డిస్‌క్వాలిఫై చేసుకుని, ఎన్నికలో మాకు ఇబ్బందిని తగ్గించేస్తాడు!” మహాబలేశ్వర్రావు నవ్వుతూ అన్నాడు.

ఈసారి ఐదుగురూ నవ్వారు.

"నా యూ కెన్ గో!" మహాబలేశ్వర్రావు ఉత్తరువిచ్చాడు.

కాన్సెప్ట్లో అయిదుగుర్నీ అంతర్థానం చేస్తూ తలుపు మూసుకుంది.

మిగిలిన ముగ్గురిలో మొదటి వ్యక్తికి సైగ చేస్తూ మహాబలేశ్వర్రావు లోపలి గదిలోకి వెళ్ళిపోయాడు. యువకుడు పైకి లేచి, పాంటులోంచీ బాగా పైకి జరిగిన చొక్కాని బెల్టులోపలికి తోసుకున్నాడు. ఇద్దరివైపూ ఒకసారి పళ్ళికిలించి గుమ్మంవైపు నడిచాడు.

3

తన ముందు కూచున్న లావుపాటి యువకుణ్ని మహాబలేశ్వర్రావు చిరునవ్వుతో చూశాడు.

"మిస్టర్ సుకుమార్, 'మీరు యెవర్నైనా ప్రేమిస్తున్నారా?' అన్న ప్రశ్నకి మీరు 'లేదు' అని సమాధానం రాశారు మీరు తప్పుడు సమాధానం రాశారు...."

"నో! ఇటీస్ కరెక్ట్!" సుకుమార్ ఆత్రంగా అడ్డు తగిలాడు.

"నో మిస్టర్ సుకుమార్, యూ ఆర్ రాంగ్!" మహాబలేశ్వర్రావు అతన్ని ఖండిస్తున్నట్టు అన్నాడు. "ఎవర్నీ ప్రేమించకుండా యే వ్యక్తీ సమాజంలో జీవించలేడు; జీవించకూడదు! మీరు మీ అమ్మనో, నాన్ననో, అన్ననో, తమ్ముణ్నో, అక్కనో, చెల్లెల్నో స్నేహితుల్నో—కనీసం మిమ్మల్నో ప్రేమిస్తూ ఉండి తీరాలి! మీ ఆన్సర్ తప్పని ఇప్పుడు ఒప్పుకుంటారా?"

సుకుమార్ అరచేత్తో నుదుర్ని తడుముకున్నాడు. ఆరిపోతున్న పెదవుల్ని నాలుకతో తడిపాడు.

"ఐ థింక్...."

"డోంట్ థింక్! ఆలోచించి సమాధానాలు రాసే పనికిరాని ప్రశ్నలు మీకు యివ్వబడలేదు!" మహాబలేశ్వ ర్రావు ఆడ్డొస్తూ అన్నాడు. "ఇప్పుడు చెప్పండి; ఎవర్నీ ప్రేమించకపోయినా, మిమ్మల్ని మీరు—కనీసం— ప్రేమించాలి. అవునా?"

" ఆఫ్‌కోర్స్" సుకుమార్ తడబడుతూ అన్నాడు.

"ఎవర్నైనా ప్రేమిస్తున్నారా అన్న ప్రశ్నకి 'లేదు' అని రాంగ్ అన్సర్ యెందుకు రాశారు?" మహాబలేశ్వ ర్రావు గంభీరంగా అడిగాడు.

ఊహించని ప్రశ్నలకి ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు సుకుమార్.

"మిమ్మల్ని మీరు ప్రేమిస్తున్నట్టు యెందుకు రాయ లేదు?" మహాబలేశ్వర్రావు కంఠం రవిశంకర్ సితార్ వాద్యాన్ని మింగేస్తూ ధ్వనించింది.

"నేను ఆలా అనుకోలేదు. ఎవర్నైనా అంటే యే అమ్మాయి నైనా ప్రేమిస్తున్నారా అని అర్థం చేసు కున్నాను...." సుకుమార్ ధైర్యాన్ని చిక్కబట్టు కుంటూ అన్నాడు.

మహాబలేశ్వర్రావు చిన్నగా నవ్వాడు. "ఆల్ రైట్, మీరు యెవరో అమ్మాయిని ప్రేమిస్తున్నట్టే యెందుకు రాయలేదు?"

సుకుమార్ కంగారుగా చూశాడు. "నేను....ఎవర్నీ ప్రేమించడం లేదు...."

మహాబలేశ్వర్రావు అతన్ని తీక్షణంగా చూశాడు. "సుకుమార్, రాతలోనే కాకుండా, మాతలో కూడా మీరు మాకు అబద్ధాలు అందిస్తున్నారు! అయామ్ సారీ...."

"ఏమిటి మీ అర్థం?" సుకుమార్ కళ్ళు చిట్లించాడు.

"మీరు మీ ఊళ్ళో పటేల్ నగర్లో వున్న సుందరేశంగారి రెండో అమ్మాయి శాంతిని ప్రేమిస్తున్నారు; అయితే నిజం చెప్పడంలేదు—అని నా అర్థం!"

సుకుమార్ మొహం ఆశ్చర్యాన్ని అద్దంలా చూపిస్తోంది. అదుర్దాతో చూశాడతను.

"మీకు ...ఎలా.... తెలుసు........?" అతని కంఠం బొంగురుగా తయారైంది.

"అన్నీ తెలుసుకోడమే మా స్క్రీనింగ్ పద్ధతి!" మహాబలేశ్వరరావు గంభీరంగా అన్నాడు.

"అయినా, అలాంటి వ్యక్తిగత విషయాలతో ఎవరికీ సంబంధం ఉండకూడదని నా నమ్మకం!" సుకుమార్ ధైర్యంగా అన్నాడు.

"డైరెక్టుగా సమ్బంధం లేకపోవచ్చు. కానీ బాధ్యత కలిగిన ఉద్యోగానికి అభ్యర్థిని ఎంపిక చేసే సందర్భంలో మేం అన్నీ తెలుసుకుంటాం. సంస్థకీ, ఉద్యోగికీ అది మంచిదని మా అనుభవం రుజువు చేసింది..."

"ఐసీ.... ఇప్పుడు.... నేను...."

"మరో ప్రశ్నకి ధైర్యంగా సమాధానం ఇస్తారు!" అంటూ మహాబలేశ్వరరావు సోఫాలో ముందుకి వాలాడు. ఏదో రహస్యం చెప్పబోయేవాడిలా సుకుమార్ మొహంలోకి చూశాడు.

"మిస్టర్ సుకుమార్, మా సంస్థలో ఉద్యోగం పొందటానికి మీరు ఆఫర్ చేసిన మొత్తం ఎంత?"

పక్కలో బాంబు పడ్డట్టు సుకుమార్ అదిరిపడ్డాడు. ఆ బేరం చాలా చాలా రహస్యంగా జరిగింది. ఇతనికి ఎలా తెలుసు?

"ఆ మొత్తం యెంతో కూడా నాకు తెలియజేయబడింది. మీరు నిజం చెప్పడానికి వెనకాడతారని 'ప్రేమ ప్రశ్న'కి సమాధానంలో స్పష్టం చేశారు! అందుకే గుచ్చి అడుగుతున్నా; ఎంత?"

సుకుమార్ గుటకలు మింగి నిస్సహాయంగా చూశాడు. గదిలోని ఎయిర్ కండిషన్ని వెక్కిరిస్తూ అతని నుదురు మీద చెమటలు కమ్మసాగేయి.

"సమాధానం చెప్పే ఉద్దేశం లేకపోతే, మీరు వెళ్ళొచ్చు!"

"రెండు....లక్షలు...." సుకుమార్ నత్తి నత్తిగా అన్నాడు.

"గుడ్! నిజం చెప్పారు!" మహాబలేశ్వర్రావు నవ్వుతూ అన్నాడు.

మరో భావం కోసం సుకుమార్ అతని కళ్ళల్లోకి వెతుకుతూ చూశాడు. మహాబలేశ్వర్రావు కళ్ళు కూడా నవ్వుతున్నాయి.

"మీడియేటర్ ద్వారా అడ్వాన్స్ యెంత పే చేశారు?"

"మొత్తంలో....ఫిఫ్టీ పర్సెంట్...."

"రైట్!" మహాబలేశ్వర్రావు నవ్వుతూ అన్నాడు సిగరెట్ వెలిగించి అతన్ని తదేకంగా చూశాడు. సుకుమార్ కళ్ళు ఆత్రుత అనే ద్రవంతో నిండిన గిన్నెల్లా ఉన్నాయి.

"మిస్టర్ సుకుమార్, మా సంస్థ హోదానీ, మీ స్థితినీ, ఉద్యోగాన్నీ కలిపి చూస్తే మీ ఆఫర్ తగినంతగా లేదనిపిస్తోంది!"

సుకుమార్ నమ్మలేనట్టు చూశాడు. పదునైన కత్తిలా అవుపిస్తున్న, ప్రవర్తిస్తున్న ఈ అధికారి నాటకం ఆడుతున్నాడా? ఏమిటి అతని ఉద్దేశం?

"సుకుమార్, మీలో పడగ ఎత్తుతున్న ప్రశ్నలు మీ మొహంమీద ప్రింటవుతున్నాయి. నేను నాటకం ఆడటం లేదు. వెల్ఫేర్ ఆఫీసరు హోదాలో మాట్లాడుతున్నా. మీ ఆఫర్ని పెంచాలి ..."

"అం.... టే...." మందంగా తయారైన నాలుకని బలవంతంగా ఉపయోగిస్తూ అన్నాడు సుకుమార్.

"మీ సందేహాల్ని క్లియర్ చేస్తాను: శీలాఫీసర్కి మా కంపెనీ బ్రహ్మాండమైన జీతం, డి.ఏ., హైక్లాస్ ట్రావెలింగ్ అలవెన్స్ వగైరా యిస్తుంది. అలాంటి ఉద్యోగం వుత్తి విద్యార్హతలకే ఎగిరి ఒళ్ళో వాలదు. మీరిచ్చే మొత్తం దాదాపు ఏడాదిలో మీకు జీతం వగైరాల రూపంలో తిరిగొస్తుంది. మీరిచ్చే మొత్తం యే వొక్క అధికారి జేబులోకీ వెళ్ళదు! అదంతా ఎంప్లాయీస్ వెల్ఫేర్ ఫండ్కి జమ అవుతుంది. దాన్ని అందరూ, మీరు కూడా—సమంగా అనుభవిస్తారు. ఇది మా సంస్థ రూపొందించిన మాస్టర్ ప్లాన్!" మహాబలేశ్వర్రావు ఉషారుగా అన్నాడు.

"నాకు....అర్థం కావడంలేదు...." సుకుమార్ నసిగాడు.

"అర్థం చెప్తాను: మీరు ఉద్యోగంలో చేరతారు. ఎంప్లాయీస్ వెల్ఫేర్ఫండ్కి నెలనెలా జీతంలోంచీ పాతిక రూపాయలు యిమ్మంటే సంతోషంగా యిస్తారా?"

'ఇవ్వను' అని సమాధానం చెప్పమంటున్న మహా

బలేశ్వర్రావు కంఠంలోని ధ్వనిని సుకుమార్ స్పష్టంగా విన్నాడు.

"...ఇద్దనేమో...."

"ఇద్దరు. మీరేకాదు; ఎవరైనా అంతే! అందుకే, మంత్రిగారి సిఫార్స్‌తో ఉద్యోగాలని అమ్ముకోవడం కన్నా, ఇవ్వగలిగినవాళ్ళకీ, అర్హత వున్నవాళ్ళకీ అమ్ముకోడం అందరికీ లాభదాయకం అని నేను భావిస్తాను. సో, మీ ఆఫర్‌ని పెంచాలి!"

"మీరే చెప్పండి..." సుకుమార్ గాలం వదుల్తూ అన్నాడు.

"నా స్క్రీనింగ్ ప్రకారం, ఔటున్న యిద్దరూ, మీరూ—మీ ముగ్గురే పోటీలో వున్నారు. మీరు రెండును మూడుగా చేయగలిగితే మంచిది!"

సుకుమార్ తేలిగ్గా నిట్టూర్చాడు. "మీ యిష్టం. అయితే ఆ యిద్దరూ...." సగంలో ఆపేశాడతను.

"మీరు ఒక ప్రశ్నకి తప్పుడు సమాధానం రాశారు. వాళ్ళు రెండు మూడు ప్రశ్నలకి రాశారు. అవకాశం మీకే యెక్కువగా వుంది....!" మహాబలేశ్వర్రావు నవ్వాడు.

"సార్....ఉద్యోగం....నాదే అంటారా?" సుకుమార్ ఆశగా అడిగాడు.

"నేను అనకూడదు. ఎమ్.డి. అంటారు. కాకపోతే ఈ ఇంటర్వ్యూ ఫలితాల్ని ఆయనకే నేను సమర్పిస్తాను! ఆల్ రైట్; వెళ్ళండి. ఎవరితోనూ యేమీ చెప్పకండి. గదిలో విశ్రాంతి తీసుకోండి. ఆర్డర్సు చేతికి వచ్చేస్తుంది. మీ పేమెంట్ జరగాల్సి వుంటుంది...."

సుకుమార్ ఉద్రేకంతో పైకి లేచాడు. "వెళ్ళమం

టారా?"

"ఒక్క క్షణం. ప్రశ్నకి మీరు పొరపాటు జవాబు రాశారు. మైనస్ మార్కులు పడతాయి! ఇదిగో, కరెక్టు ఆన్సర్ రాసి, యేమీ జరగనట్టు వెళ్ళిపొండి!" అంటూ మహాబలేశ్వరరావు అతని ఫైల్ని టీపాయ్‌మీద పడేశాడు.

అదరాబాదరా అందుకుని సుకుమార్ తను భ్రాంతిని ప్రేమిస్తున్నట్టు రాయడం ప్రారంభించాడు. ముగించి, భయభక్తులతో ఫైలుని అందించి నిటారుగా నించున్నాడు.

"మీ సహకారానికి చాలా థాంక్స్, సార్....మీ మేలు "

"పర్ఫెక్ట్!" మహాబలేశ్వరరావు అడ్డుతగిలాడు. "రేపు ఇంటర్వ్యూ పూర్తయ్యేదాకా ఈ విషయంలో పూర్తి మౌనం పాటించడం మీకు తోడ్పడుతుంది. చివరి క్షణం మిమ్మల్ని మా సంస్థ ఫెయిల్ చేయొచ్చు; మీ ఆఫర్ అవకాశాన్ని అందుకున్నా సరే!"

సుకుమార్ ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు. "నోరు మెదపను. మీరు చెప్పినట్టు...."

"సుకుమార్, నోరు మూసుకోడం మీరింకా నేర్చుకోలేదు!" మహాబలేశ్వరరావు నవ్వుతూ అన్నాడు.

సుకుమార్ ఉక్కిరిబిక్కిరిగా చూసి, కిక్కురుమనకుండా గదిలోంచి ఇవతలికి నడిచాడు.

సోఫాలో వెనక్కి వాలి మహాబలేశ్వరరావు సిగరెట్ వెలిగించాడు. ముందు గదిలో కూచున్న యిద్దరు అభ్యర్థులూ కాసేపట్లో సుకుమార్‌లాగే బైటికి వెళ్తారని అతనికి తెలుసు.

4

'బఫెలో ఫెర్టిలైజర్స్' అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు అతను ఆటో దిగాడు. ముందుగానే తను బాడుగ తీసుకున్న ఆటో డ్రైవరు అతనివేపు చూడకుండా ఆటోను బొంగరంలా తిప్పి వచ్చిన దారమ్మటే పోనిచ్చాడు.

సిగరెట్ వెలిగించి, అతను ఫుట్‌పాత్ మీద చెట్టులా నిలబడ్డాడు. ఇంటర్వ్యూ ఈపాటికి పూర్తయివుంటుంది. తొమ్మిదో అభ్యర్థి అయిన తను అటెండ్ కానందుకు, ఇతర అభ్యర్థులూ, ఇంటర్వ్యూబోర్డు సభ్యులూ లోపల్లోపలే ఆనందిస్తూ వుంటారు. అయితే తను రానందుకు ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ హెడ్ ప్రాణేశ్వరరావు ఆశ్చర్యంలో మునిగి, తరవాత తీరిగ్గా తేలి, హాయిగా ఊపిరి పీల్చుకుని వుంటాడు!

ఇవాళ అతనికి రెండు విషయాలు పూర్తిగా మతి పోగొట్టి వుంటాయి: యేదో ప్లాన్‌తో తనొక్కడే రాకుండా ఇతర అభ్యర్థులంతా రావడం; ఒంటరిగా అటెండ్ కావాల్సిన తను—మహేశ్వర్రావు—అసలు రాకుండా వుండటం! ఈపాటికి తనని ప్రాణేశరావు పిచ్చివాడికింద జమ కట్టేసి గొప్ప రిలీఫ్‌తో నవ్వుకుంటూ వుంటాడు.

సిగరెట్‌ని వేళ్లమధ్య ఇరికించి, అతను రిస్టువాచీ చూసుకున్నాడు. ఇంటర్వ్యూకి తను గంట ఆలస్యంగా హాజరవుతున్నాడు. అయినా ఫరవాలేదు. ముందే, ఎవడో నిర్ణయించిన కాలవ్యవధి తనని కట్టిపడవేయదు! సగర్వంగా చిరునవ్వు నవ్వుకుంటూ అతను సిగరెట్ పీకని దూరంగా విసిరాడు.

ఆతనికి మళ్ళీ ప్రాణేశరావు గుర్తుకొచ్చాడు. తను రానందుకు ఇందాకా ఆశ్చర్యపోయిన ప్రాణేశరావు ఈ క్షణంలో తనని చూసి, అదిరిపోతాడు! నవ్వుకుంటూ అతను గేటువేపు ఠీవిగా నడిచాడు.

బిల్డింగ్ ముందున్న వరండా మీద నిలబడి అతను అటూ, ఇటూ చూశాడు. ఎన్క్వయిరీస్ కౌంటర్ వెనక ఉండాల్సిన వ్యక్తి లేడు. కుడివేపు తిరిగి అతను వేగంగా నడవసాగాడు. చివరున్న లిఫ్ట్‌ని సమీపించి, ఆగాడు. కాసేపట్లో లిఫ్ట్ ఆగింది.

"ఏ ఫ్లోర్ సార్?" యూనిఫామ్‌లో ఉన్న లిఫ్ట్‌బాయ్ అతన్ని ప్రశ్నించాడు. అతను సమాధానం చెప్పకుండా, నిర్లక్ష్యంగా లిఫ్ట్‌లోకి దూరాడు. కళ్ళు చిట్లిస్తూ తనని చూస్తున్న లిఫ్ట్‌బాయ్‌ని చిరునవ్వుతో చూశాడు.

"ఇంటర్వ్యూ!" అన్నాడతను క్లుప్తంగా.

"ఇంటర్వ్యూ అయిపోయింది సార్...." లిఫ్ట్‌బాయ్ విసుగ్గా అన్నాడు.

"ఇంటర్వ్యూ అయ్యాకే రమ్మని నాకు ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చారు. అక్కడికి తీసికెళ్ళు!" మహాబలేశ్వరరావు నవ్వుతూ అన్నాడు.

లిఫ్ట్ కదిలింది....

కాస్సేపట్లో, లిఫ్ట్‌కుర్రాడు చూపించిన గదిముందు నిలబడ్డాడు మహాబలేశ్వరరావు. గది తలుపులు మూసి ఉన్నాయి. తను లోపలికి అడుగుపెట్టగానే ప్రారంభమయ్యే ప్రళయాన్ని తలచుకుంటూ అతను హాయిగా నవ్వుకున్నాడు. పాలోచనగా వరండా ఇరువైపులా చూశాడతను. వరండా రెండువైపులా వివిధ సెక్షన్స్ న్నాయి. సెక్షన్స్‌లో కార్యక్రమాలు సాగుతున్నట్టు

న్నాయి. బైట సందడిలేదు. ఇంటర్వ్యూ కారణంగా సిబ్బంది బైటికి రాకుండా కట్టుదిట్టం చేసినట్టున్నారు!

ఆలోచనల్ని కత్తిరించేస్తూ అతను భుజంతో బలంగా తలుపుల్ని తోసుకుంటూ లోపలికి జొరబడ్డాడు. గోడ వారగా వున్న సోఫాలమీద వరసగా అభ్యర్థులు కూచు న్నారు. అతను వాళ్ళవైపు పరిశీలనగా చూశాడు. తనరాక అందర్నీ ఉలిక్కిపడేలా చేసినట్టు అతను గుర్తించాడు. ఎదురుగా ఉన్న మూసిన తలుపు ముందు స్టూలుమీద ఠీవిగా కూచున్న యూనిఫామ్డ్ జవాను కోపంగా చూస్తూ అతని దగ్గరగా వచ్చాడు.

నిన్న తనని ఫ్యాక్టరీ పి.ఆర్.వో. అండ్ వెల్ఫేర్ ఆఫీసర్ హోదాలో, రిమ్‌లెస్ అద్దాలతో, చెవుల్ని కప్పిన క్రాపుతో, ముక్కుమీద పులిపిరికాయతో, వెడల్పాటి మీసాలతో చూసిన అభ్యర్థులు—ఇవాళ పోల్చుకోలేరని అతనికి నమ్మకంగా తెలుసు ...

“ఎవరు మీరు? ఎందుకొచ్చారు? ఇలా రాకూడదు!” యూనిఫామ్‌లో ట్రిమ్‌గా అవుపిస్తున్న ద్వారపాలకుడు దబాయిస్తూ అన్నాడు.

మహేశ్వర్రావు అతన్ని సూటిగా చూస్తూ, చిరునవ్వు నవ్వాడు. అయితే అతని కళ్ళు—వడగళ్ళలా ఉన్న కళ్ళు-నవ్వడంలేదు. “నేను ఇలా రాకూడదంటే, నువ్వు ఆ గుమ్మంముందు కాదు; ఈ గుమ్మం బైట బైఠాయించాలి!” అన్నాడతను, తన వెనక ఇంకా తెరుచుకునే ఉన్న తలుపువైపు సైగచేస్తూ.

జవాను బుర్రమీసాలు గమ్మత్తుగా కదిలాయి. సోఫాలమీద కూచున్న తొమ్మండుగురూ కిసుక్కున నవ్వారు.

"మీకు ఎవరు కావాలి?" కొద్దిగా ఖంగుతిన్న జవాను కోపాన్ని దిగమింగుతూ అడిగాడు.

"నువ్వే!"

జవాను బుర్రమీసాలు మళ్ళీ కదిలాయి. "నేనా? నాతో ఏమిటి పని?"

"చిన్నపని. లోపలికెళ్ళు. ఇంటర్వ్యూకోసం మహాబలేశ్వర్రావుగారు వచ్చారనీ, త్వరగా లోపలికి రప్పించుకొమ్మనీ అయ్యగార్లకు చెప్పు!"

జవాను బుర్రమీసాలతోపాటు కనుబొమలూ కదిలాయి. వెర్రివాడిని చూస్తున్నట్టు మహాబలేశ్వర్రావుని చూశాడతను. "ఇంటర్వ్యూ అయిపోయింది. మీరు ఆలస్యంగా వచ్చారు. లాభంలేదు!"

మహాబలేశ్వర్రావు అతన్ని నవ్వుతూ చూశాడు. "లాభం లేకపోవచ్చు. నేను వచ్చానని చెప్తే నీకు నష్టమూ రాదు!"

"సీక్రెట్ కాన్ఫరెన్స్‌లో వున్నారు. డిస్టర్బ్ చేయడానికి వీల్లేదు! మీరు వెళ్ళిపోవచ్చు. అయ్యగారిచేతే ఆ మాట అనిపించుకోవాలంటే బైట వెయిట్ చేయొచ్చు!" జవాను ఎగతాళిగా అన్నాడు.

మహాబలేశ్వర్రావు అతన్ని నిర్లక్ష్యంగా చూస్తూ మూసిన తలుపువేపు కదిలాడు. అతని ఎడమచెయ్యి డోర్ హేండిల్‌ని పట్టుకుంది. మరుక్షణం అతని భుజమ్మీద యేదో చెయ్యి బరువుగా పడింది. తలతిప్పి, తనవేపు ఆగ్రహంతో చూస్తోన్న జవాన్ని నవ్వుతూ చూశాడతను. అతని కుడిచెయ్యి మెరుపులా కదిలింది. జవాన్ చొక్కాను ఛాతీభాగంలో బలంగా పట్టుకున్నాడతను. అమాంతంగా జవాను వెనక్కి తూలాడు. చిన్న చప్పుడుతో స్టూలు

మీదికి వాలిపోయాడు. అదేక్షణంలో అతని ఎడమ చెయ్యి తలుపుని బలంగా లాగింది. లోపలికి దూరి అతను తలుపుని వదిలేశాడు. చప్పుడు చేస్తూ తలుపు మూసుకుంది.

పాంటు జేబుల్లో రెండు చేతులు దోపుకుని అతను తలుపుకి వీపు ఆన్చి, వాలుగా నిలబడ్డాడు. తనవేపు ఆగ్రహంతో చూస్తోన్న భారీవ్యక్తి మొహంలోకి అతను నిర్భయంగా చూస్తూ వుండిపోయాడు.

భారీవ్యక్తి ముందున్న ముగ్గురు తలల్ని వెనక్కి తిప్పి ఆశ్చర్యంగా చూస్తున్నారు. అలా చూస్తున్న మూడు ముఖాల్లో ఒకటి ఎస్టాబ్లిష్‌మెంటు హెడ్ ప్రాణేశరావుది.

“హూ ఆర్ యూ?” భారీవ్యక్తి, మేనేజింగ్ డైరెక్టర్ హుంకరించాడు.

మహాబలేశ్వర్రావు నిటారుగా నించున్నాడు. హుందాగా నడుస్తూ నలుగురి మధ్యావున్న టేబులు దగ్గర ఆగాడు.

“నేను అక్కడే వుంటే, మీ మిత్రుల మెడలు బెణికిపోతాయి! అందుకే, అందరికీ సులభంగా అవుపించేలా యిక్కడికి వచ్చాను....” మహాబలేశ్వర్రావు నవ్వుతూ మేనేజింగ్ డైరెక్టర్‌తో అన్నాడు.

ఎమ్. డి. మొహం కందగడ్డలా అయింది. రెప్పవేయకుండా చూస్తున్న ఎమ్.డి. చెయ్యి టేబిల్ కింద తడివింది. తటాలున తలుపు తెరుచుకుంది. మహాబలేశ్వర్రావు వోరగా చూశాడు. బుర్రమీసాల జవాను వినయం, కోపం రెండూ కలిసి, నువ్వు తెప్పించేలా తయారైన మొహంతో నిలబడ్డాడు.

“ఇతన్ని ఎందుకు రానిచ్చావ్?” ఎమ్.డి. గర్జిం

చాడు.

"నేను రానివ్వలేదు సార్. అతనే నన్ను తోసేసి.."

"షటప్!" ఎమ్.డి. కంఠం లక్ష్మీ టపాకులా పేలింది. "ఇతన్ని బైటికి గెంటేయ్!"

మహాబలేశ్వరరావు రెండు కాళ్ళనీ ఎడంగా చాపాడు.

పాంటు జేబుల్లోంచి చేతుల్ని ఇవతలికి లాగి, పిడికిళ్ళుగా మార్చాడు. తన దగ్గరగా ఆగిన బుర్రమీసా అతన్ని ఓరగా చూసి, ఎమ్.డి. వైపు తీక్షణంగా చూశాడు.

"ఈసారి నీ శిష్యుణ్ని ఈ పిడికిళ్ళతో పచ్చడి చేస్తాను. కిందికివంచి, అతని వీపుమీద రోలులా కూచుని, అతని బుర్రమీసాల్ని కళ్ళెంలా రెండు చేతుల్లో పట్టుకుని బైటికి తోలుకెళ్తాను. వరండాలో బోర్లా పడుకో బెట్టి తిరగేస్తాను!"

ఎం.డి. శరీరంలోని రక్తమంతా అతని మొహంలోకి సర్రున ఎగబాకింది. "మాసయ్యా!...." అరిచాడతను.

మీసాల మాసయ్య చేతిని మహాబలేశ్వరరావు భుజం మీద వేశాడు. మహాబలేశ్వరరావు చెయ్యి మాసయ్య భుజంమ్మీద వాలింది. మాసయ్య అసంకల్పితంగా కెవ్వుమన్నాడు. అతని భుజమ్మీద నరాన్ని నొక్కుతున్న వేళ్ళని మహాబలేశ్వరరావు వదులు చేశాడు. అతని భుజమ్మీద వేసిన తన కుడిచేతిని కంగారుగా తన ఎడం భుజమ్మీద ఆన్చుకున్నాడు మాసయ్య.

ఎం. డి. చివాల్న కుర్చీలోంచి లేచాడు. అదురుతున్న పెదవులను కంట్రోలు చేసుకుంటూ గర్జించాడు. "త్రో హిం ఔట్!"

మాసయ్య అదుర్దాగా చూశాడు. "అప్పయ్యనీ.... గోవిందసామినీ....తీసుకొస్తాను సార్...."

"షటప్! గెటౌట్ యూజ్ లెస్ ఫెలో!" ఎమ్.డి. అరిచాడు. బతుకుజీవుడా అనుకుంటూ మాసయ్య మెరుపులా మాయమయ్యాడు.

"యూ స్కౌండ్రల్! పోలీసుల్ని పిలుస్తాను. ఆఫీసులోకి అనుమతి లేకుండా జొరబడి న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్న నిన్ను...."

"సార్....శాంతించండి....ముందు అతనెవరో, ఎందుకిలా వచ్చాడో కనుక్కుందాం........" కల్పించుకుని అంటున్న ప్రాణేశరావుని మహాబలేశ్వరరావు చిరునవ్వుతో చూశాడు. ఎంతయినా ప్రాణేశరావు తెలివైన ఘటం!

"ఎవర్నువ్వు" టెలిఫోన్ మీంచి చేతిని తియ్యకుండా ఎమ్.డి. గద్దించాడు.

"అలా అడిగారు: బావుంది! ఇలా ఇంటర్వ్యూకి ఒక అభ్యర్థి సకాలంలో హాజరు కాలేదు. అతని పేరూ, నా పేరూ, ఒకటే!" మహాబలేశ్వరరావు నవ్వుతూ అన్నాడు.

"వాటీస్ యువర్ బాడ్ నేమ్?" ఎమ్.డి. హుంకరించాడు.

"బఫెలో ఫెర్టిలైజర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యసంకల్పం, నీ ముందున్న కాగితాల్లో నా పేరు వుంటుంది చూసుకో!" మహాబలేశ్వరరావు నిర్లక్ష్యంగా అన్నాడు.

ఇద్దరు పరాయి పెద్దమనుషుల సమక్షంలో తనని ఏకవచనంలో సంబోధిస్తున్న మహాబలేశ్వరరావుని మింగేసేలా కాసేపు చూసి, నిప్పులు కక్కుతున్న తన కళ్ళని ఎమ్.డి.

సత్యసంకల్పం ప్రాణేశరావువైపు తిప్పాడు.

"ప్రాణేశరావ్, లూనటిక్స్‌ని కూడా ఇంటర్వ్యూకి పిలుస్తున్నారు! సెక్షన్‌లో మీరు నిద్రపోతున్నారా?" ఎమ్.డి. కంఠంలో అధికారం ఖంగుమంది.

"సార్, మీరు ఎక్సైట్ అవకండి. అతను కుశాలంలో ఇంటర్వ్యూకి రాలేకపోయినట్టున్నాడు. కొంచెం కన్సిడర్ చేస్తారేమో...."

"ఇంపాసిబుల్! ఉయ్ స్టిక్ టు ది రూల్స్. ఉయ్...."

"మిస్టర్ సంకల్పం, జస్ట్ మోమెంట్!" అతని ఎదురుగా కూచున్న పెద్దమనిషి, పాత్రో అడ్డు తగిలాడు. "ఇతను ఉద్యోగ ప్రయత్నాల్లో, ఇంటర్వ్యూల్లో వోడిపోయి డెస్పరేట్ అయినట్టున్నాడు. లెట్స్ రిలాక్స్ ది రూల్స్. లెట్స్ ఇంటర్వ్యూ హిమ్!"

'ఇంటర్వ్యూ చేస్తే పోయేదేం లేదుగా! ఎలాగా ఇతనికి ఉద్యోగం ఇవ్వంగా!' అన్న ధ్వని స్పష్టంగా పాత్రో కంఠంలో దాగింది. పాత్రో మెల్లిగా లేచి మహాబలేశ్వరరావు వేపు నడిచాడు. అతని ముందు నిలబడి వోదార్పుగా చూశాడు.

"యంగ్ మాన్, నీకు ఇంటర్వ్యూ కావాలి. అంతేగా? కమాన్ ... ఇలా కూర్చో...."

పొట్టిగా లావుగా పీపాలా వున్న పాత్రోని మహాబలేశ్వరరావు చిరునవ్వుతో కలయజూశాడు. అతని చూపులు పాత్రో కళ్ళల్లోకి గుచ్చుకుపోయాయి.

"అయిదో క్లాసు కొడుక్కి పదమూడో ఎక్కం చెప్పలేక నెలకి ముప్పై రూపాయల రేటుతో అందమైన అమ్మాయితో ప్రయివేటు ట్యూషన్ యేర్పాటు చేసి,

పాఠం చెప్పినంతసేపూ ఆ అమ్మాయిని కళ్ళతో తినేస్తూ కూచునే నీలాంటివాళ్ళచేత ఇంటర్వ్యూ చేయబడటానికి నేను రాలేదు!" మహాబలేశ్వర్రావు కంఠం గంటలా ధ్వనించింది.

పాత్రలో దబడలు గడగడ వణికాయి. నమ్మలేనట్టు మహాబలేశ్వర్రావు మొహంలోకి చూశాడు. మెల్లగా స్లో మోషన్‌లో అతని తల సత్యసంకల్పం వేపు తిరిగింది. సత్యసంకల్పం ఎద్దులా బుసకొడుతున్నాడు.

"ఓకే....ఐ విల్ కాల్ ది పోలీస్...." అంటూ అతను రిసీవర్ని పైకెత్తి నంబర్ డయల్ చేయడానికి చూపుడువేలిని గురిపెట్టాడు.

"నీకు ఆ శ్రమ అక్కర్లేదు. అరగంటలో నేను ఇక్కణ్ణుంచీ ఫోన్ చేయకపోతే నా మిత్రుడు ఏ.సి.బి. వాళ్ళనీ, పోలీసువాళ్ళనీ, ఫోటోగ్రాఫర్‌నీ, పత్రికా విలేఖర్లనీ ఒకేసారి తీసుకొస్తాడు!" మహాబలేశ్వర్రావు కంఠం సత్యసంకల్పాన్ని చెంపపెట్టులా తాకింది. డయల్ చేయబోతున్న చెయ్యి కొద్దిగా గురితప్పింది.

"వాట్ డూ యూ మీన్?" అరిచాడతను.

"ఐ మీన్ వాట్ ఐ సెడ్! ఫీల్డాఫీసర్ పోస్టుకి ఇంటర్వ్యూల పేరుతో ఇవాళ మీరు ముగ్గురూ ఆడిన, ఆడుతున్న నాటకం యేమిటో నాకు పూర్తిగా తెలుసు. ఈ ఒంటిస్తంభం మేడమీది గదిలో గుట్టుచప్పుడు కాకుండా మీరు ఆడుతున్న నాటకాన్ని బైటికి లాగి 'వీధి నాటకం'గా మార్చడానికే నేనొచ్చాను!" మహాబలేశ్వర్రావు అందరినీ కలయ జూస్తూ గంభీరంగా అన్నాడు.

ముగ్గురి ముఖాలకీ అతుక్కున్న హోదా, అధికారం,

ఐశ్వర్యం అన్న మూడు పొరలూ ఊడివచ్చేలా క్షణకాలం కనిపించాయతనికి.

మహాబలేశ్వర్రావు టేబులు దగ్గర జరిగి రెండు చేతుల్నీ టేబుల్ మీద బోర్లించి ముందుకి వంగాడు. అందర్నీ ఒకసారి కలయజూశాడు.

“ఈ ఇంటర్వ్యూ ఎప్పుడు, ఎలా జరుగుతుందో, ఎవరికి ఎంత రేటుకి ఉద్యోగం అమ్మబడుతుందో, ఇంటర్వ్యూ జరిపించే విద్యాధికులూ, పెద్దమనుషులూ ఎవరో వాళ్ళ కథలేమిటో, అభ్యర్థులు ఎవరో, వాళ్ళ జాతకాలేమిటో- అన్నీ నాకు ఎప్పుడో తెలుసు! నేను త్రికాలజ్ఞుణ్ని! మీ బతుకుల్ని నిన్న, నేడు, రేపు హెడ్డింగులకింద పాఠంలా అప్పజెప్పగలను!” అతను నవ్వుతూ ఆగి, తనకు యెదురుగా కూచున్న ప్రాణేశరావుని చూశాడు.

ప్రాణేశరావు వెర్రివాడిలా, అయోమయంగా, కంగారుగా చూస్తున్నాడు. అతని చేతులు టేబులుమీద లేవు. అవి వణుకుతున్నాయనీ, అతని వొళ్ళో దాక్కున్నాయనీ, మహాబలేశ్వర్రావుకి తెలుసు.

“మిస్టర్, ఏమిటేమిటో పిచ్చిగా వాగుతున్నావ్. ఇంతకీ నువ్వెవరు?” అంతవరకూ మౌనంగా కూచున్న దీనబాంధవమూర్తి ప్రశ్నించాడు.

మహాబలేశ్వర్రావు అతన్ని చిరునవ్వుతో చూశాడు. “ఓహ్! దీనబాంధవుడు! ఇంతసేపూ మౌనంగా వుండిపోయారేమిటా తమరు అని ఆలోచిస్తున్నా. మీ క్యాండిడేట్ సర్వసన్నద్ధంగా వచ్చుండాలే!” దీనబాంధవమూర్తి మొహం ఎర్రగా అయింది.

“నువ్వు ఇంటర్వ్యూ కోసం వచ్చినవాడివి కావని అర్థమవుతోంది. ఎవర్నువ్వు?” అప్పటికి కొద్దిగా తేరు

వున్న పాత్రో ప్రశ్నించాడు, కుర్చీలో కూర్చుంటూ.

మహాబలేశ్వర్రావు నిటారుగా నించున్నాడు. పక్కనే ఉన్న కుర్చీని ఎడంచేత్తో వెనక్కి లాగాడు. ఒక్క కదలికతో అందులో కూర్చుని హుందాగా వెనక్కి వాలాడు. కాలుపై కాలు వేసుకుంటూ సిగరెట్ వెలిగించాడు. అందరివేపూ నిర్లక్ష్యంగా చూస్తూ అగ్గిపుల్లని ఆర్పి వాళ్ళమధ్య టేబులుమీద పడేలా రువ్వాడు.

ఏదో అడగబోయిన సత్యసంకల్పం కంఠానికి, అతని కంఠం కటాలున అడ్డు తగిలింది.

“ఆయామ్ శివరావ్” అన్నాడతను గంభీరంగా.

5

ఎమ్.డి. సత్యసంకల్పం, పాత్రో, దీనబాంధవమూర్తి, ముఖ్యంగా ప్రాణేశరావూ ఆశ్చర్యంతో తయారుచేయబడిన విగ్రహాల్లా వుండిపోయారు.

“నువ్వు మహాబలేశ్వర్రావువి. ఏదో పేరు చెప్పి బుకాయించకు!” మహాబలేశ్వర్రావు అనే అభ్యర్థి పేర ఇంటర్వ్యూ లెటర్ పంపిన ప్రాణేశరావు ముందుగా తెప్పరిల్లి, అన్నాడు.

శివరామ్ అతనివేపు నవ్వుతూ చూశాడు. “మహాబలేశ్వర్రావు పేరుతో నేను అప్లై చేశాను; ఆ పేరుతో నీ ‘ఇంటర్వ్యూ పిలుపు’ పంపించావ్!”

“ఆలస్యంగా వచ్చినందుకు నిన్ను ఇంటర్వ్యూ చేయమన్న భయంతో, డెస్పరేట్ అయిపోయి నువ్వు రౌడీలా లోపల దూరి, ఇక్కడ మొరటుగా ప్రవర్తిస్తున్నావని అర్థమవుతోంది. ఆలస్యాన్ని క్షమించి నిన్ను ఇంటర్వ్యూ చేస్తాం....” ఎమ్.డి. సత్యసంకల్పం ఆరితేరిన బేరగాడిలా దువ్వే ప్రయత్నం చేస్తూ అన్నాడు.

"మంచి నిర్ణయం!" పాత్రో మెచ్చుకున్నాడు.

"యస్. గుడ్ డెసిషన్! దీనబాంధవమూర్తి బుర్రని ఆవేశంగా ఊపుతూ అన్నాడు.

శివరామ్ వాళ్ళని చిరునవ్వుతో చూస్తూ ఉండి పోయాడు. అతని చేతిలో సిగరెట్ పొగ చిమ్ము తోంది.

"నేను మహాబలేశ్వర్రావు అనే తప్పుడు పేరుతో అప్లై చేశానని ఇందాకే చెప్పాను. అలాంటి నన్ను ఎలా యింటర్వ్యూ చేస్తారు?" నవ్వుతూ ప్రశ్నించాడు శివ రామ్.

"విష్ణువుకి ఉన్నట్టు నీకు వెయ్యి పేర్లు ఉండొచ్చు. ఉయ్ డోంట్ కేర్! మాక్కావాల్సింది నీ అప్లి కేషన్లో, సర్టిఫికెట్స్‌లో ఉండే పేరే!" ఎస్టాబిష్ మెంట్ వ్యవహారాల్లో బుర్ర పండిపోయిన ప్రాణేశరావు కల్పించుకుని అన్నాడు.

ఎమ్.డి. సత్యసంకల్పం తన సెక్షన్ హెడ్‌ని మెప్పుగా చూశాడు. "యస్; మనకి అవసరమైంది అంతే!"

సిగరెట్ పొగ ఊదుతూ శివరామ్ కుర్చీలో ముందుకి వాలాడు. "అయితే ఇంటర్వ్యూ చేసి, నాకు ఉద్యోగం ఇస్తారా?"

అతి విచిత్రమైన విషయం విన్న వాళ్ళల్లా నలుగురూ మొహాలు చూసుకున్నారు. సత్యసంకల్పం వాలుగా శివరామ్‌ని చూశాడు.

"ఆ గ్యారంటీ నరమానవుడు ఇవ్వలేడు. ఇంటర్వ్యూ చేస్తాం. అందులో వ్యక్తమయ్యే నీ శక్తి సామర్థ్యాల మీదా, వినయవిధేయతల మీదా ఫలితం ఆధారపడి

ఉంటుంది!"

అతని మాటని బాలమురళి సంగీతంలా భావించి తతిమ్మా ముగ్గురూ తలలు ఊగిస్తూ వుండిపోయారు.

"మహాబలేశ్వర్రావ్, ఇక్కడ స్మోక్ చేయకూడదు. సిగరెట్ ఆర్పేయ్!" సందుచూసుకుని ప్రాణేశరావు ధైర్యంగా అన్నాడు

శివరామ్ అతనివైపే చూస్తూ సిగరెట్ పీకని టేబుల్ అంచుమీద నొక్కి ఆర్పేశాడు. కోటుజేబు లోంచీ పాకెట్ తీశాడు. కొత్త సిగరెట్ని పెదాల మధ్య యిరికించాడు. అగ్గిపెట్టె అందుకున్నాడు.

"డోంట్ స్మోక్!" సత్యసంకల్పం హుంకరించాడు.

శివరామ్ ప్రాణేశరావుమీంచి తన చూపుల్ని అతని మీదికి మళ్ళించాడు. పెదాలమధ్య సిగరెట్ అతన్ని వెక్కిరిస్తున్నట్టు కదిలింది. "కాసేపట్లో నేను చెప్ప బోయేది విన్నాక, మీరు నలుగురూ తలో అగ్గిపెట్టె పట్టుకుని, ఒకేసారి పుల్లలుగీసి నా సిగరేట్ ముట్టించ డానికి పందా లేసుకుని ఎగబడతారు!"

"వాట్ నాన్సెన్స్...." సత్యసంకల్పం ప్రారంభించాడు.

"షటప్!" శివరామ్ కంఠం టపాకాయలా పేలింది.

ఉక్కిరిబిక్కిరవుతూ చూస్తున్న శివరామ్ నవ్వుతూ చూశాడు. అతని వేళ్ళమధ్య అగ్గిపుల్ల వెలిగింది. సిగరెట్ పొగ చిమ్మింది.

"నేను ఫేక్ అప్లికేషన్ పంపానని చెప్తున్నా కూడా నన్ను ఇంటర్వ్యూ చేయడానికి మీరు సిద్ధపడుతున్నా రంటే ఏదో పిచ్చి ప్రశ్నలు అడిగి పీడ వదలించుకోవా

లని చూస్తున్నారని నాకు అర్థమవుతోంది!" శివరామ్ నవ్వుతూ అన్నాడు.

"అంత తెలిసిన వాడివి ఇక్కడెందుకున్నావు? గెట్ ఔట్!" సత్యసంకల్పం ఉక్రోషంతో అరిచాడు.

"మిమ్మల్ని ముగ్గుర్నీ ఇంటర్వ్యూ చేయడానికి ఉన్నాను మిస్టర్ మేనేజింగ్ డైరెక్టర్!" శివరామ్ గంభీరంగా అన్నాడు.

సత్యసంకల్పం పిడికిలి సుత్తిలా టేబుల్‌ని చరిచింది. పైపోటు తీసిన కందగడ్డలా తయారైన మొహాన్ని శివరామ్ నవ్వుతూ చూశాడు. తటాలున లేచి నిలుచున్నాడు. అందరూ అతన్ని తలలెత్తి ఆశ్చర్యంగా చూశారు.

"సత్యసంకల్పం, రాజమండ్రీనుంచీ వచ్చిన సుకుమార్ నన్నాళ్ రుద్రయ్య—నుండీ ఉద్యోగం యివ్వడానికి నువ్వు రెండు లక్షలకి బేరం కుదుర్చుకున్నావ్. మీ డియేటర్ కన్నారావ్ నీకు లక్ష అడ్వాన్స్‌గా చెల్లించాడు. అవునా?" శివరామ్ ప్రశ్న గదిలో ప్రతిధ్వనించింది.

"నాన్సెన్స్!" సత్యసంకల్పం అరిచాడు. అతన్ని నిర్లక్ష్యం చేస్తూ శివరామ్ పాత్రో వైపు తిరిగాడు.

"పాత్రో, పాత్రోచితంగా ఉద్యోగం ఇవ్వాలని అనుకున్న నువ్వు, ఇంటర్వ్యూ బోర్డు సభ్యుడైన వెంటనే నీ ఆ వీపాకులున్న గ్రామ పంచాయితీ సర్పంచ్‌కి కాబోయే అల్లుడైన కోటేశ్వరరావుకి ఉద్యోగం ఇప్పించడంకోసం, లక్షన్నరకి బేరం చేసి, అంతా అడ్వాన్స్‌గా పుచ్చుకున్నావ్!" శివరామ్ అతని రియాక్షన్ కోసం చూడకుండా దీనబాంధవమూర్తి వైపు తిరిగాడు.

"నువ్వు దీనబాంధవుడివి. అందుకే యిద్దరు అభ్యర్థులకి

యేర్పాటు చేస్తున్నట్టు నటించి ఒక అభ్యర్థి చిదంబరం నుండీ లక్ష అడ్వాన్సుగా గుంజేశాడ్!" శివరాం కంఠం గర్భగుడిలో జేగంటలా ధ్వనించింది.

"మిస్టర్ సత్యసంకల్పం, మీ ఇంటర్వ్యూ కోసం పనులన్నీ మానుకుని వచ్చాం. ఎవడో అనామకుడి చేత పనికిమాలిన మాటలు అనిపించుకుంటున్నాం? ఈ దారుణాన్ని మీరు సహించినా మేం సహించం!" దీనబాంధవ మూర్తి బొబ్బలెట్టాడు.

"యస్! దిసీజ్ టూ మచ్! దిసీజ్ డామేజింగ్! ఐ విల్ సీ దట్ ...."

"నోర్ముయ్!" శివరామ్ హుంకరించాడు. కోపంతో, అవమానంతో తాత్కాలికంగా మూగవాళ్ళయిపోయినా ముగ్గురూ గుటకలు మింగుతూ చూశారు.

"ముగ్గురూ యెవరికివారు తలా వో కాండిడేట్ని సెలెక్ట్ చేసుకుని, జేబులు నింపుకున్నారు. ముగ్గుర్లో యే వ్యక్తికి ఉద్యోగం వచ్చినా ఇద్దరికి లాభిస్తుంది. మేనేజింగ్ డైరెక్టర్కీ, ఆ అభ్యర్థిని గెలిపించిన ఇంటర్వ్యూ బోర్డు మెంబర్కీ! యెటొచ్చీ సత్యసంకల్పానికి ఢోకా లేదు. పోటీలో యెవరు గెలిచినా అతనికి ఆదాయమే!" శివరామ్ నవ్వుతూ ఆగి, ప్రాణేశ్వరరావువైపు చూశాడు.

"నన్ను బైటపెట్టొద్దు; ప్లీజ్!" అంటున్నాడు ప్రాణేశ్వరరావు కళ్ళలో.

"ముగ్గురూ నష్టపోకుండా, ముగ్గురి బేరాలూ, పరువూ చెడిపోకుండా చక్కటి మార్గంకోసం యిప్పుడు అన్వేషిస్తున్నారని నేను ఊహించగలను! ఎక్కువ ఆఫర్ చేసే వ్యక్తికి ఫీల్డాఫీసర్ పట్టాభిషేకం చేసి, తతిమ్మా బేరగాళ్ళిద్దరికీ యేదో ఉద్యోగం క్రియేట్ చేసి ఇరికించేయాలని

ప్లాన్ చేస్తున్నారు. ఆ ప్లాన్ని రిజైన్ చేసి అసలు జరపడానికే ఎస్టాబ్లిష్‌మెంట్ ఎక్స్‌పర్టు ప్రాణేశరావు ఈ సమావేశంలో పాల్గొంటున్నాడు! దీన్నంతా సాధన కలిగే మొనగాడు ఎవరైనా ఉంటే చెయ్యి పైకెత్తవచ్చు!" శివరామ్ ఛాలెంజ్ చేస్తూ నవ్వాడు.

ఆగ్రహంతో ఊగిపోతూ ఎమ్.డి. సత్యసంకల్పం మళ్ళీ కుర్చీలోంచి లేచాడు. జేవురించిన ముఖాల్తో తన యెదురుగా కూచున్న యిద్దరు పెద్దమనుషుల్ని ఉద్రేకంతో చూశాడు.

"అయాం సారీ. మీకు యిబ్బంది కలుగుతోంది. పిచ్చాసుపత్రినుండీ తప్పించుకు వచ్చిన వీడివల్ల మన కార్యక్రమానికి అంతరాయం కలిగింది. లెట్స్ గో టు ది కాన్ఫరెన్స్ హాల్...." అంటూ అతను ప్రాణేశరావు వైపు చూశాడు.

"ప్రాణేశరావు, ఈ పిచ్చివాణ్ని ఇక్కణ్నుంచీ బైటికి గెంటించి, తరవాత మమ్మల్ని కల్సుకో!"

పెద్ద రిలీఫ్‌తో పాత్రో, దీనబాంధవమూర్తి ఆదరాబాదరా పైకి లేచారు. ప్రాణేశరావు యింకా ఆశ్చర్యంలోనే తన్నుకుంటున్నట్టు రెప్పవేయకుండా శివరామ్‌నే చూస్తున్నాడు. చదివింపులు చేస్తున్న ముగ్గురికీ ఉద్యోగాలు యేర్పాటు చేయడంకోసం సాగుతున్న వాళ్ళ ప్రయత్నం గురించి తను అన్న మాటలు నిజమే అని ప్రాణేశరావు మొహం, కళ్ళూ శివరామ్‌కి చెప్తున్నాయి.

"దెన్ యు హావ్ టూ క్రియేట్ టూ పోస్ట్స్...." అన్న ఎమ్.డి. మాటల్ని తలుపుతోస్తూ తను విన్న సంగతి వాళ్ళకి తెలిసినట్టులేదు. తన ఊహకి ఆ మాటే తల్లి అనీ వాళ్ళకి తెలీదు!

మరో గదిలోకి వెళ్ళడానికి సిద్ధమవుతున్న ముగ్గుర్నీ శివరామ్ నవ్వుతూ చూశాడు. తటాలున వెనుదిరిగి గుమ్మం వైపు జోరుగా నడిచాడు. కదుల్తున్న ముగ్గురూ అతన్ని అర్థంకానట్టు చూస్తూ ఆగి, ముఖాలు చూసుకున్నారు. ముగ్గురి చూపులూ కలిసినట్టుగా శివరామ్‌వైపు తిరిగాయి.

శివరామ్ మూసిన తలుపు దగ్గరగా ఆగాడు. అతని చెయ్యి డోర్ హాండిల్ని పట్టుకుంది. మెల్లిగా తలుపు తిప్పి స్తంభాల్లా అచేతనంగా నిలబడ్డ ముగ్గుర్నీ, కంగారుగా చూస్తున్న ప్రాణేశరావునీ తీక్షణంగా చూశాడు.

"ఒక్క క్షణం ఆగండి! తరవాత మీ దారి మీదీ, నా దారి నాదీ! కంఫర్టబుల్‌గా నన్ను పిచ్చివాడికింద జమకట్టేసి, జారుకోడానికి ప్లాన్ చేశారు. ఉద్యోగం వస్తుందన్న ఆశతో మీ ముగ్గురికీ అడ్వాన్సులు చెల్లించి ముందు గదిలో కూచుని కలలు కంటున్న ముగ్గురు కుర్రాళ్ళనీ మొదటి విడత లోపలికి పిలుస్తాను...."

"స్టాప్ ది నాన్సెన్స్...." సత్యసంకల్పం అరిచాడు.

అతన్ని వెక్కిరింపుగా చూస్తూ శివరామ్ ప్రారంభించాడు: "ఒకడికి ఫీల్డాఫీసర్ పని అనే బహుమతి యిచ్చి, తతిమ్మా యిద్దరికీ రెండు కన్సొలేషన్ బహుమతులు యివ్వడానికి మీరు రూపొందిస్తున్న ప్లాన్ని వాళ్ళకి వివరిస్తాను. లక్షల్లక్షలు వాళ్ళనుండి గుంజుకుంది నిజమే అని వాళ్ళ చేత చెప్పిస్తాను. తమని యెందుకిలా మోసం చేస్తున్నారో చెప్పమంటూ వాళ్ళే మిమ్మల్ని ఇంటర్వ్యూ చేస్తారు: చేయిస్తాను!"

శివరామ్ చెయ్యి కొద్దిగా కదిలింది. తలుపు అరడుగు కదిలింది. శివరాం తలని నిర్లక్ష్యంగా తలుపువైపు తిప్పాడు.

"ఆగు!" ఎమ్.డి. సత్యసంకల్పం కంఠంలోని ఆదుర్దా శివరామ్‌కి చక్కిలిగింతలు పెట్టింది. వెనక్కి తిరిగి నవ్వుతూ చూశాడు. సత్యసంకల్పం పెదవులూ, దవడలూ నిశ్శబ్దంగా కదులుతున్నాయి. మరో అడల్ట్ డోస్ తగిలితేగానీ లాభంలేదని శివరామ్ గ్రహించాడు.

"నైవేద్యం పెట్టి వరంకోసం కాచుకున్న సుకుమార్, కోటేశ్వరరావూ, చిదంబరంమిమ్మల్ని ఇంటర్వ్యూ చేశాక లోకంకోసం దిష్టిబొమ్మలుగా మీరు పిలిపించిన తతిమ్మా అయిదుగురు బలిపశువుల్నీ లోపలికి పిలుస్తాను కథంతా వర్ణనలతో, అలంకారాలతో — టీకాతాత్పర్యాలతో వివరిస్తాను. వాళ్ళకి జరుగుతున్న అన్యాయాన్ని బొమ్మ గీచి చూపిస్తాను. ఆ తరవాత వాళ్ళు అయిదుగురూ మిమ్మల్ని ఇంటర్వ్యూ చేస్తారు. ఆ ఈదురుగాలి దెబ్బ నుండి మీరు కోలుకోగానే ఈ ముగ్గుర్నీ, ఆ అయిదుగుర్నీ ఒక్కటిగా—అన్నదమ్ముల్లా, ప్రాణమిత్రుల్లా కలిపేసి మూకుమ్మడిగా మీ ముగ్గుర్నీ 'ఇంటర్వ్యూ' చేయిస్తాను."

"స్టాప్!" ఎమ్.డి. సత్యసంకల్పం కంఠం విని అతని దగ్గరగా ఉన్న ముగ్గురూ అదిరిపడ్డారు. శివరామ్ పాలిపోయిన అతని ముఖాన్ని చిరునవ్వుతో చూశాడు.

"ఇంకొంచెం ఉంది: నేను మీకు ఏర్పాటుచేస్తున్న ఇంటర్వ్యూలు జరిగే చారిత్రక క్షణాల్లో నీ పెర్సనల్ స్టెనోగ్రాఫర్, ఇక్కడ నించుని మొత్తం షార్టుహాండ్‌లో రికార్డుచేస్తుంది. ఆ తరవాత దాన్ని ఫోటో కాపీలు తీయించి, దేశంలోని పత్రికలకి బహూకరిస్తాను...."

"ఐసే, స్టాపిట్!"

శివరామ్ హుంకరించిన సత్యసంకల్పాన్ని చిరునవ్వుతో చూస్తూ తలుపుని మరికొంచెం తోశాడు.

"తలుపు మూసెయ్!" సత్యసంకల్పం కంఠం వణికింది.

శివరామ్ తలుపు మూసేశాడు. తృప్తికరంగా సిగరెట్టు వెలిగించాడు.

"నేను మూయమన్నావ్; మూసుకున్నాను. తలుపు మూయమన్నావ్ మూసేశాను. ఇప్పుడేం చేయమంటావ్?" శివరాం నవ్వుతూ అడిగాడు.

సత్యసంకల్పం పళ్ళు కొరుక్కుంటూ చూశాడు. "ఇలా రా!"

శివరాం నవ్వుతూ టేబుల్ దగ్గరగా నిలిచి, అతన్ని ప్రశ్నార్థకంగా చూశాడు.

"హూ ఆర్ యూ?"

"పేరు శివరామ్ అని ఇందాకే చెప్పాను....ఊరు.." శివరాం నవ్వుతూ ప్రారంభించాడు.

"అదికాదు!" సత్యసంకల్పం గద్దించాడు.

"మరేది?" శివరాం నవ్వుతూ ప్రశ్నించాడు.

"నిజం చెప్పు: నువ్వెవరు? ఎందుకొచ్చావ్?"

"నేనెవరో యెన్నిసార్లు చెప్పినా నీకు అర్థంకాదు. నాలుగైదుసార్లు బఫేలో ఫెర్టిలైజర్స్ ఫీల్డాఫీసర్ పోస్టుకి అప్లికేషన్స్ని ఆహ్వానించి, సరైన గిరాకీ దొరక్క ఇంటర్వ్యూల్ని కాన్సిల్ చేస్తూ వచ్చిన నిన్ను, ఇంటర్వ్యూల్ని నోట్లకట్టలుగా మార్చేసుకునే ఇంద్రజాలికుడైన నీ మిత్రుణ్ని ఇంటర్వ్యూ చేయడానికి వచ్చిన మహేంద్రజాలికుణ్ని!" శివరాం గంభీరంగా అన్నాడు.

సత్యసంకల్పం బలహీనంగా కుర్చీలో కూలబడ్డాడు. పాత్రో, దీనబాంధవమూర్తి కూడా కూలబడ్డారు. ఉన్నట్టుండి సత్యసంకల్పం ఉలిక్కిపడ్డాడు. తనున్న ఉన్నత

మయిన హోదా అతనికి తటాలున గుర్తొచ్చినట్టుంది.

"బఫెలో ఫెర్టిలైజర్స్ ప్రయివేట్ సంస్థ. మాకు తగిన వ్యక్తి దొరికేదాకా ఇంటర్వ్యూలు కొట్టిపారేస్తూ వుంటాం. మా ఇష్టంవచ్చిన వ్యక్తిని, ఇష్టంవచ్చిన ఉద్యోగంలో, ఇష్టంవచ్చినప్పుడు పెట్టుకుంటాం! అడ్డు చెప్పడానికి నువ్వెవరు? హూ ఆర్ యూ?"

శివరాం పకపక నవ్వాడు. తటాలున నవ్వు ఆపేసి సత్యసంకల్పాన్ని తీక్షణంగా చూశాడు. "ప్రయివేట్ సంస్థ అయినంత మాత్రాన నువ్వు ఇష్టానుసారంగా గంతులేయడానికి వీల్లేదు, మేనేజింగ్ డైరెక్టర్! నీ ప్రయివేట్ సంస్థ బండారం నాకు అరచేతిగీతల్లా తెలుసు! నీ సంస్థకి, నీ 'ప్రయివేట్' సంస్థకి యెన్ని బ్యాంకుల్లోంచీ యెంత మొత్తాన్ని 'పబ్లిక్' మొత్తాన్ని అప్పు పేరుతో తీసుకున్నావో గుర్తుందా? బఫెల్లో ఫెర్టిలైజర్స్ ప్రయివేట్ ఫర్మ్ అవొచ్చు. బ్యాంకులు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్‌లూ మీ అబ్బవి కావు. అవి ప్రభుత్వానివి; ప్రజలవి! ఆ ప్రజా సంస్థలని దేవిరించి నువ్వు నీ ప్రయివేటు సంస్థని సొంత సామ్రాజ్యంగా మార్చుకుంటున్నావ్! ప్రభుత్వం తలుచుకుంటే—తలుచుకునేలా చేస్తాం—నీ ప్రయివేట్ రాజ్యం పబ్లిక్ రాజ్యం అయిపోగలదు! గుర్తుంచుకో!"

సత్యసంకల్పం ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు. పరిస్థితి గ్రహించిన ప్రాణేశరావ్ చిన్న కాగితంముక్క మీద యేదో రాసి పాత్రోకి అందించాడు. పాత్రో దాన్ని చదివి, పక్కనేవున్న దీనబాంధవమూర్తికి అందించాడు. కాగితంలోని రాత చక్కగా నచ్చిన దీనబాంధవమూర్తి దాన్ని సత్యసంకల్పానికి అందించాడు. శివరాంకు

యేం చెప్పడమో అని తన్నుకుచస్తున్న సత్యసంకల్పం అర చేతిలో ఇముడ్చుకున్న కాగితంముక్కని కళ్ళు చిట్లిస్తూ చదువుతున్నాడు. మరో సిగరెట్ వెలిగిస్తూ, దాన్నంతా గమనించనట్టు నటిస్తూ వుండిపోయాడు శివరాం.

కాగితంముక్క చుట్టూ పిడికిలి బిగించిన సత్యసంకల్పం ప్రశ్నార్థకంగా ప్రాణేశ్వరావువేపు చూశాడు. కదలిక స్పష్టంగా తెలియకుండా ప్రాణేశ్వరావు తల కదిలింది. అతని కళ్ళు మేనేజింగ్ డైరెక్టర్‌కు యెంతో చెప్తున్నాయి....

కొంచెం తేరుకున్న సత్యసంకల్పం నిట్టూరుస్తూ కుర్చీ వెనక్కి వాలాడు. టేబుల్ అంచుమీద లావుపాటి వేళ్ళతో డోలు వాయించాడు. డోలు సోలో ఆపేసి, అప్పుడే యేదో నిర్ణయానికి వచ్చినవాడిలా శివరామ్ వేపు అదోలా చూశాడు.

“మిస్టర్, మా సంస్థలో ఫీల్డాఫీసర్ ఉద్యోగం కోసమే నువ్వు ఈ రభస చేస్తున్నావని అర్థమవుతోంది. నీలాగా ధైర్యంగా వ్యవహరించేవాళ్ళకే ఇక్కడ స్థానం వుంటుంది! ఇందాకా నువ్వు చెప్పిన బుర్రకథల్ని మన్నించి, నీకు ఫీల్డాఫీసర్ ఉద్యోగం ఇవ్వడానికి నిశ్చయించుకున్నాం....”

శివరాం నవ్వు అతని కంఠానికి వెలక్కాయలా అడ్డుపడింది. నవ్వాపి శివరామ్ అతన్ని తదేకంగా చూశాడు.

“బఫెలో ఫెర్టిలైజర్‌కు—బర్రె ఎరువును బుర్ర నిండా పెట్టుకున్న నీలాంటి వాడికింద నేను ఉద్యోగం చేస్తానని ఎందుకనుకున్నావ్ ?”

శివరామ్ ప్రశ్న సత్యసంకల్పాన్ని చెంపపెట్టులా తాకుతోంది. అదురుతున్న పెదవుల్ని కంట్రోలు చేసు

ఉంటూ అతను 'చూశావా?' అన్నట్టు సలహా యిచ్చిన ప్రాణేశరావువేపు చూశాడు. ప్రాణేశరావు గుటకలు మింగాడు.

"మిస్టర్ సత్యసంకల్పం, అతనికి యేం కావాలో కనుక్కొని పారేయండి! నిజా నిజాలు యెలా వున్నా ప్రజలూ, పత్రికలూ ఇతనిలాంటివాళ్ళు చెప్పే పాడు మాటల్ని నమ్ముతారు...." ఒక నిర్ణయానికి వచ్చి, ధైర్యంగా సలహా ఇచ్చాడు పాత్రో. దీనబాంధవ మూర్తి కళ్ళు అతని మాటని ఆత్రంగా అండర్ లైన్ చేస్తున్నాయి.

వెనక్కి వాలిన సత్యసంకల్పం ముందుకు వొంగి, మోచేతుల్ని టేబులుమీద ఆన్చి, సూటిగా శివరామ్ వేపు చూశాడు.

"ఆల్ రైట్! నీకు ఉద్యోగం వద్దు; మరేం కావాలి?...." దబాయిస్తున్నట్టు మేకపోతు గాంభీర్యంతో అడిగాడతను.

శివరామ్ నవ్వుతూ మెల్లిగా కుర్చీలో కూచున్నాడు. కాలుమీద కాలు వేసుకుని అందరినీ కలయజూశాడు.

"ఇంత సేపటికి ఎరువు మాటలు మానేసి మొలకెత్తే విత్తనంలాంటి మాటన్నావ్! 'వాగులాట కబడీ' ఆడుతూ టైమ్ వేస్టుచేయడం మీకే ప్రమాదం గనక, మీవున్న స్థితి గురించీ, నేనున్న స్టేజీ గురించీ మరోసారి మీ బుర్రల్లోకి ఎక్కిస్తాను: మీ అందరి జాతకాలూ నా డైరీలో ఉన్నాయి. మీ శాంతు అకౌంట్లు ఆజీరితో ఎలా బాధపడుతున్నాయో నాకు తెలుసు. ఏ యే బ్యాంకుల్లో ఏ యే నెంబర్లతో మీ ముగ్గురికీ ఖాతాలున్నాయో అమరంలా అప్పజెప్పగలను. మీ శరీరాల్లోంచి కారిన చెమట

ఆ ఖాతాల్లో రూపాయలుగా జమ అవలేదనీ నాకు తెలుసు. ప్రస్తుతం అమాయకుల్ని బలి తీసుకోడానికి ఇక్కడ మీరు ఆడుతున్న 'ఇంటర్వ్యూహం' గురించీ నాకు తెలుసని, మీకూ తెలుసు...."

"నాన్సెన్స్....నీకేం కావాలో ఒక ముక్కలో చెప్పు!" సత్యసంకల్పం ఉరిమాడు.

"ఈసారి నా ఉపన్యాసానికి అడ్డు తగిలితే లేచివెళ్ళి తలుపు తీస్తాను. ఎనిమిదిమంది గ్రహాల్ని మీమీదికి వదులాను. నేనూ వాళ్ళతో చేరి నవగ్రహాల్లా మీ ముగ్గురినీ చుట్టేసి, క్షణంలో మీ జాతకాలు మార్చేస్తాను!" శివరామ్ గంభీరంగా అన్నాడు.

ముగ్గురూ గతుక్కుమంటూ ముఖాలు చూసుకున్నారు. ప్రాణేశ్వరావు తన్నుకొస్తున్న నవ్వుని మింగలేక, దగ్గురూపంలో వెళ్ళగక్కాడు. శివరామ్ మళ్ళీ ప్రారంభించాడు:

"సో. మీ గురించి యేది లోకానికి తెలిస్తే మీకు ప్రమాదమో ఆ కథ పూర్తిగా నాకు తెలుసని మీకు తెలుసు. ఈ తెలిసిందాన్నంతా మరిచిపోయేంత 'మతిమరుపు రోగం' నాకు రావాలంటే నేను సూచించే రెండు 'చిన్నపనులు' మీరు రెండు చేతులతో చేయాలి. లేదంటే నా దారిన నేను పోతాను. పోయేలోగా సరికొత్త ఇంటర్వ్యూహంలో మిమ్మల్ని ఇరికించి, ఉక్కిరిబిక్కిరి చేస్తాను. మీ అభ్యర్థులు ముగ్గురూ మిమ్మల్ని గానుగ ఆడేస్తారు. దగా చేయబడిన బలహీనులు అయిదుగురూ వీధిలో—అంటే కోర్టులో మిమ్మల్ని పిండి కొట్టేస్తారు. వాళ్ళ తరఫున నేనూ, ఇంతసేపూ వోపిగ్గా దీన్నంతా గమనిస్తున్న ప్రాణేశ్వరావూ, మరి కొంతమంది

మీ ఉద్యోగులూ సాక్షులుగా హాజరవుతాం....”

“శివరామ్! పాడిందే పాడ్డం దండగ! నీకేం కావాలో చెప్పు!” సత్యసంకల్పం విసుగ్గా అడ్డుతగిలాడు. అతను ప్రదర్శిస్తున్న విసుగు వెనక గుండె దడ వుందని శివరామ్‌కి తెలుసు....

“రైట్!” శివరామ్ నవ్వుతూ అన్నాడు. సిగరెట్ని టేబుల్ మీద నొక్కి లేచి, ఎత్తుగా నిలబడ్డాడు.

“ఏం కావాలి? ఏం కావాలి? అని చాలాసార్లు అడిగారు. నాకేం కావాలో వివరంగా చెప్తాను; జాగ్రత్తగా వినండి....” శివరాం ఆగి నవ్వుతూ చూశాడు. తను ఆశించిన భావం, ఆదుర్దా, భయం రెండూ కలిగిన భావం వాళ్ళందరి మొహాల్లోనూ అద్దాల్లో ప్రతిబింబంలా స్పష్టంగా అవుపిస్తోంది! అతను సత్యసంకల్పాన్ని తదేకంగా చూశాడు.

“నువ్వు ఉద్యోగాన్ని ఒకడికి రెండు లక్షలకి అమ్మే ప్లాన్ చేశావ్. నీ మిత్రుడు పాత్రో లక్షన్నరకీ, దీనబాంధవుడు మరో లక్షన్నరకీ అదే ఉద్యోగాన్ని మరో యిద్దరికి ప్రామిస్ చేశారు. ఈ మూడు మొత్తాల్ని ముగ్గురూ విడివిడిగా రెట్టింపు చేసి, ఒకటిగా కలిపి అరగంటలోగా నాకు చెల్లిస్తారు....”

“వా అఅఇఅట్?” తన చెవుల్ని నమ్మలేక సత్యసంకల్పం వెర్రివాడిలా అరిచాడు. పాత్రో, దీనబాంధవమూర్తి అయోమయంగా మొహాలు చూసుకున్నారు.

“రెండూ రెండూ నాలుగూ, ఒకటిన్నరా ఒకటిన్నరా మూడూ, మరో ఒకటిన్నరా ఒకటిన్నరా మూడూ — మొత్తం పది నాకు వెంటనే అందాలి....” శివరామ్ నెమ్మదిగా అన్నాడు.

సత్యసంకల్పం రెప్పలు చీలుకుపోతూ అతని కళ్ళు ఎద్దు కళ్ళలా తయారు చేశాయి.

"ఐ కాంట్ బిలీవ్ ....ఐ కాంట్ ....ఐ...."

"షటప్!" శివరామ్ నవ్వుతూ అన్నాడు. "ఇంక రెండో డిమాండ్: మీరు ఇంటర్వ్యూకి పిలిపించిన వర్రాళ్ళలో రామసీతారావు అనే అతనున్నాడు. మీకు శ్రమ తగ్గించడానికి నేనే అభ్యర్థిని సెలక్ట్ చేశాను. అతన్ని ఫీల్డాఫీసర్ గా నియమిస్తూ నా సమక్షంలో ఆర్డర్స్ జారీ చేస్తారు...."

"నో!" కంగారుపడిపోతూ సత్యసంకల్పం అరిచాడు. "ఇది..ఇది దారుణం! అన్యాయం! అక్రమం! దుర్మార్గం! నువ్వు....నువ్వు....నువ్వు..బ్లాక్ మెయిల్ చేస్తూన్నావ్!"

"బ్లాక్ మెయిల్, వైట్ మెయిల్, రెడ్ మెయిల్. నేను చేస్తున్న దాన్ని నీ ఇష్టం వచ్చిన పేరుతో పిలుచుకో! రెండు పనులూ చేయడానికి నీకు సరిగ్గా అరగంట గడువిస్తున్నా...."

"యూ బాస్టర్డ్! ఐ విల్ కాల్ ది పోలీస్! ఐ విల్ కాల్ ది సిబిఐ! ఐ విల్ కాల్ ది " సత్యసంకల్పం పూనకం వచ్చిన వాడిలా అరవడం ప్రారంభించాడు. వణుకుతున్న అతని చెయ్యి టెలిఫోన్ రిసీవర్ మీద పడింది.

శివరామ్ మెరుపులా కదిలాడు. సత్యసంకల్పం చేతిని దూరంగా తోసి, రిసీవర్ని అందుకున్నాడు. సత్యసంకల్పం తేరుకునేలోగా చకచకా ఒక నంబర్ని డయల్ చేశాడు.

"గో ఫర్దర్, గో ఎ హెడ్! వీళ్ళంతా పోలీసుల్నే కోరుకుంటున్నారు. ఎ.సి.బి. వాళ్ళనీ, పోలీసుల్నీ, క్రైమ్ రిపోర్టర్ ప్రభంజనాన్నీ, ఫోటోగ్రాఫర్నీ ఒకే వేన్‌లో

తీసుకురా....!"

"..........."

"యస్! అరగంట! నా ఇంటర్వ్యూకి అరగంట చాలు! క్విక్!........ఫర్వాలేదు. మనకి ఉపయోగించక పోయినా, దేశానికి ఉపయోగిస్తుంది!" శివరామ్ రిసీవర్ని పడేసి నవ్వుతూ చూశాడు.

టేబుల్ మీదున్న సత్యసంకల్పం రెండు చేతులూ వణుకుతున్నాయి. అతని పెదవులూ, దవడలూ, కిందికి జారిన గడ్డమూ ఎంతో ఐకమత్యంతో వణుకుతున్నాయి. ఊపిరి పీల్చుకోడం మానేసి, శిలావిగ్రహాల్లా తతిమ్మా యిద్దరూ రెప్పవేయకుండా సత్యసంకల్పం శరీరంలో కేంద్రీకరించిన భూకంపాన్ని చూస్తున్నారు. ప్రాణేశ్వరావు కళ్ళు రెప్పల్ని చీల్చుకుంటూ శివరామ్ వైపే చూస్తున్నాయి. ఆ కళ్ళల్లో ఆశ్చర్యం, ఆరాధనా స్పష్టంగా ప్రత్యక్షమవుతున్నాయి.

శివరామ్ గిరుక్కున వెనక్కి తిరిగాడు. హుందాగా నడుస్తూ మూసిన తలుపుని చేరుకున్నాడు. అతని చెయ్యి పైకి లేచింది.

"ఆగు!" సత్యసంకల్పం బొంగురు కంఠం శివరాం చేతిని గాలిలో స్తంభింపజేసింది.

చేతిని దించుకోకుండా శివరాం అతనివైపు తిరిగి విసుగ్గా చూశాడు.

"స్కౌండ్రల్ కమ్ హియర్!" సత్యసంకల్పం తగ్గు స్వరంలో అన్నాడు. అతని ఆగ్రహం వెనక నక్కి దాక్కున్న వోటమిని శివరాం రెండు చెవులతో శుభ్రంగా విన్నాడు

"యస్, ఎమ్ డీ?" మర్యాద ఉట్టిపడే కంఠంతో

అంటూ శివరాం అతని దగ్గరగా ఆగాడు.

"టెలిఫోన్ అందుకో. సీతోక, గోవర్ధనో, గోపీచందనో ఎవడో వాడితో మాట్లాడు. ఇంద్రాకా నువ్విచ్చిన ఇన్‌స్ట్రక్షన్స్‌ని కాన్సిల్ చెయ్! కూచుని మాట్లాడుదాం " సత్యసంకల్పం బింకంగా అన్నాడు.

చిన్నగా నవ్వుతూ శివరాం కుర్చీలో కూచుని టెలిఫోన్ని దగ్గరగా లాక్కున్నాడు. నంబర్ డయల్ చేసి, సిగరెట్ వెలిగించాడు. కాసేపట్లో అతని కంఠం గదిలో ప్రతిధ్వనించింది.

"గోవర్ధన్.... సంప్రదింపులు ఫలిస్తున్నాయి. వెంటనే రావొద్దు. మరో అరగంటలో నేను తిరిగి రాకపోతే, నా ఫోన్ కాల్ కోసం యెదురుచూడకుండా అందర్నీ తీసుకుని విందుకి రా!"

రిసీవర్ని పడేసి శివరాం అర్థమైందా అన్నట్లు సత్యసంకల్పం వైపు చూశాడు.

"ఎలాగో మూడులక్షలు పారేస్తాం. నువ్విక్కడికి వచ్చిన సంగతీ, తరవాత జరిగిన సంగతులూ, ఇంటర్వ్యూ అన్నింటినీ మరిచిపోయి వెళ్ళిపో!" సత్యసంకల్పం బెట్టుగా అన్నాడు.

"సత్యసంకల్పం, నీ సంకల్పం అసత్యంగా వుంది. వెనకాముందూ ఆలోచించి నేనొక మొత్తం చెప్పాను. బేరాలవల్ల ఆ మొత్తంలో మార్పులు వస్తాయి; కాదనను. అయితే ఆ మార్పులు యెప్పుడూ ఆ మొత్తాన్ని పెంచుతూనే వుంటాయి!" శివరాం నవ్వుతూ అన్నాడు.

పాలిపోతున్న మొహాన్ని సత్యసంకల్పం పాత్రో వైపు తిప్పి, నిస్సహాయంగా చూశాడు.

"మిస్టర్ సత్యసంకల్పం, త్రో ది బార్కింగ్ డాగ్

వాట్ ఇట్ వాంట్స్! వాడడిగింది గిరాటేయండి! తల చెడిపోయి. బీపీ పెరిగిపోయేలా ఉంది. పొద్దుటలేచి, ఏ అభ్యర్థి మొహం చూశానో...." పాత్రో పళ్ళు కొరుక్కుంటూ అన్నాడు. దీనబాంధవమూర్తి తలని గంగిరెద్దులా ఆడించాడు.

సత్యసంకల్పం నిట్టూరుస్తూ తలపంకించాడు. "అర గంటలో సర్దడం సాధ్యంకాదు...." గొణుక్కుంటున్నట్టు అన్నాడతను.

"సాధ్యం అవుతుంది; అయితీరాలి!" శివరాం నవ్వుతూ అన్నాడు. "వాళ్ళిద్దరూ వసూలుచేసుకున్న మొత్తాలకి తక్కువపడింది కలిపి సాయంత్రమో రేపో నీకు అందిస్తారు. ఇద్దరూ నీ ప్రాణమిత్రులుగా? నీది ఎలాగా ఫర్వాలేదు. సో, నా సలహా విను; బ్యాంకు నుండీ అఘమేఘాలమీద మొత్తమంతా తెప్పించెయ్!"

"బా....స్టర్డ్...."

శివరాం జోక్ విన్నవాడిలా పకపక నవ్వాడు. "ఆ పని జరిగేలోగా ప్రాణేశరావు సెక్షన్లో పనిచూస్తాడు. రామసీతారావుని ఫీల్డాఫీసరుగా నియమిస్తూ పక్కా ఆర్డర్స్ తయారుచేయిస్తాడు...."

"దటీస్ సన్నాఫ్ యువర్...." సత్యసంకల్పం ఉగ్రుడైపోయాడు.

"హోల్డాన్! ఆ ఆర్డర్ లేకపోతే నీ సొమ్ము నీ దగ్గరే ఉండిపోతుంది! నా దారిన నేను ..."

"రామసీతారా వెధవో....వాడు నీ బంధువా?" పళ్ళు కొరుక్కుంటూ సత్యసంకల్పం ప్రశ్నించాడు.

శివరాం అతని కళ్ళల్లోకి తదేకంగా చూశాడు. "అతను నా మేనల్లుడు. ఎందుకంటే, నువ్వు నా మేన

మానవి!"

"ఇది ఘోరం! నువ్వడిగిన భిక్షం పారేస్తాం. జోలె నింపుకుని, శోకముడుచుకుని పారిపో! మా ఎస్టాబ్లిష్ మెంట్ వ్యవహారాల్లో నువ్వు వేలు పెట్టడం నేను సహించను!" సత్యసంకల్పం బెదిరింపుగా అన్నాడు.

శివరాం రవ్వల్లా మెరుస్తున్న కళ్ళతో అతన్ని తదేకంగా చూశాడు. "సంకల్పం, ఆమాట మరోసారి అని చూడు!"

"ఒకసారి కాదు; వంద సార్లు అంటాను! ఏం చేస్తావ్?" సత్యసంకల్పం గాండ్రించాడు.

శివరాం అతన్ని రెప్పవేయకుండా చూశాడు. "ఏం చేస్తానో నేను చెప్పను. నీ మిత్రులిద్దరూ, నీ శిష్యుడు ప్రాణేశ్వరావూ నీకు అర్థమయ్యేలా చెప్తారు!"

పాత్రో గొంతు సవరించుకున్నాడు. "మిస్టర్ సంకల్పం, లేనిపోని గొడవలు లేవదియ్యకండి. బాలూ, బ్యాటూ రెండూ అతని చేతిలోనే ఉన్నాయి! జరిగే దేదో జరిగిపోనివ్వండి. చరిత్ర ఇవాళ్టితో ముగిసిపోదు!"

"యస్! అతను అడిగినవన్నీ యిచ్చేయండి. చేయబోయిన చిన్న పొరపాటుకు పేపర్లలోకెక్కి చిన్నబోవడం నాకిష్టంలేదు...." దీనబాంధవమూర్తి మెల్లిగా అన్నాడు.

పంక్చర్ చేయబడిన సైకిల్ ట్యూబులా, సత్యసంకల్పం నిట్టూర్చాడు. ఓటమి దళసరి ముసుగులా అతని మొహాన్ని కప్పేసింది. నుదురు ముడతలుగా మారింది. రెండోసారి నిట్టూర్చి అతను సాలోచనగా శివరాంవైపు చూశాడు.

"పొయ్యి ఊదే గొట్టంలా శబ్దం చేస్తూ నిట్టూరుస్తూ నువ్వు టైం వేస్టు చేస్తే నాకేం అభ్యంతరం లేదు. అయితే సేఫ్టీ పీరియడ్‌లో అప్పుడే అయిదారు నిమిషాలు...." శివరాం ఆపేశాడు.

సత్యసంకల్పం తన ముఖాన్ని ప్రాణేశరావువైపు తిప్పాడు. "ప్రాణేశరావ్, రామసీతారావో వాడెవడో ఫైల్స్ చూసి, అపాయింట్‌మెంటు ఆర్డర్ టైప్ చేయించి పట్రా. వెళ్ళు!" అన్నాడు విషాదగీతం పాడుతున్న గాయకుడిలా.

ప్రాణేశరావు మెల్లిగా లేచాడు. సత్యసంకల్పం ఏదో గుర్తువచ్చిన వాడిలా లెటర్ హెడ్ మీద వణికే చేత్తో ఏదో బరకాడు. ఫర్రున చించి ఆ కాగితాన్ని ప్రాణేశరావువైపు విసిరాడు. "అకౌంట్సు హెడ్‌కి యిచ్చేయి. పదిహేను నిమిషాల్లో మొత్తం యిక్కడుండాలని చెప్పు.... అన్నట్టు యెవరితోనూ యేమీ చెప్పకు. బ్యాంకు నుంచీ రాగానే, అపాయింటుమెంటు ఆర్డర్‌తో బాటు దాన్ని నువ్వే పట్రా!" ఆజ్ఞాపించాడతను ఎమ్.డి. హోదాలో.

తలపంకిస్తూ ప్రాణేశరావు స్వప్నచారిలా నడుస్తూ నిష్క్రమించాడు.

తీరుబడిగా, విశ్రాంతిగా కూచుని సిగిరెట్ వెలిగిస్తున్న శివరాంని సత్యసంకల్పం కొత్తగా చూశాడు. హార్ట్‌స్ట్రోక్ నుంచీ యిప్పుడిప్పుడే కోలుకుంటున్నవాడిలా తయారయ్యాడతను.

"మహాబలేశ్వ...." సన్నటి కంఠంతో సత్యసంకల్పం ప్రారంభించాడు.

"శివరాం!" శివరాం నవ్వుతూ సరిదిద్దాడు.

"ఆల్ .... రైట్ .... శివరాం, నువ్వాడమన్నట్టుగా ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది; ఆదేశాం. జరిగిందంతా పూర్తిగా మరిచిపోతావుగా?" ప్రాధేయపడుతున్నట్టు ప్రశ్నించాడతను.

"పూర్తిగా; పర్మనెంటుగా!" శివరాం కులాసాగా నవ్వుతూ అన్నాడు.

సత్యసంకల్పం నిట్టూర్చి, క్షణకాలం తటపటాయించాడు. "శివరాం...."

"యస్?"

"మాట యిచ్చిన ముగ్గురికీ మేం ఉద్యోగాలిచ్చుకుంటాం. దాన్ని గురించి మళ్ళీ....మళ్ళీ... తిరగదోడవుగా?"

శివరాం పకపక నవ్వాడు. "తిరగతోడానికి నేనెవర్ని? కాకపోతే, మీరు ముగ్గురూ 'బఫెలో ఫర్టిలైజర్స్'లో పెద్ద పెద్ద ఉద్యోగాల్ని క్రియేటు చేసి, ఆకాశం అంటే రేట్లతో ముగ్గురికి వేలం వేసేస్తున్నారని ఒకేవొక వ్యక్తికి తెలియజేసేసి, విశ్రాంతి తీసుకుంటాను!"

సత్యసంకల్పం ఆశ్చర్యంగా, ప్రశ్నార్థకంగా చూశాడు. "ఎవరికి?" తడబడుతూ అడిగాడతను.

తలలు వంచి, ఏకాగ్రతతో తనవేపే చూస్తున్న ముగ్గుర్నీ శివరాం చిరునవ్వుతో చూశాడు. "ఇతర దేశాల్లోని ఎరువుల ఫ్యాక్టరీల్ని సందర్శించడానికి వెళ్ళి, ఈ ఉదయమే ఫ్రాంక్ ఫర్ట్ చేరుకున్న మీ ప్రొప్రయిటర్ భావరాజుకి!"

ముగ్గురూ ఒకేసారి ఉలిక్కిపడ్డారు. సత్యసంకల్పం కంగారునుండీ ముందుగా తెప్పరిల్లాడు. అసహాయత

ఆగ్రహంగా మారి ఆవిర్లుగా అతనిలోంచి పైకి చిమ్మింది.

"స్కాండ్రల్! నీకన్నీ తెలుసు...." పళ్ళు కొరుకుతూ అన్నాడతను.

"అదీ నా పెట్టుబడి!" అన్నాడు సగర్వంగా శివరాం.

6

తలుపు మూసి, దానికే ఆనుకుని సిగిరెట్ వెలిగించాడు శివరాం. అద్దంముందు కూచుని, పొద్దుతిరుగుడు పువ్వులా మొహాన్ని తనవేపు తిప్పి ఆత్రంగా చూస్తున్న అతని చిరునవ్వుతో చూశాడు. ఇంకా మేకప్ అతికించని లత మొహం రాత్రంతా మంచులో తడిసి శుభ్రంగా తయారైన గులాబీలా ఉంది.

"డార్లింగ్...." పెదాలకు దగ్గరగా ఉంచుకున్న లిప్‌స్టిక్‌ని కదపకుండా అంది లత.

"హౌడీ, హనీ?" శివరాం ఉషారుగా అన్నాడు.

"నెవర్ బెటర్! కమ్ నియర్ డార్లింగ్...." లత కంఠం ప్రేమతో పదునెక్కింది.

హోటల్ కుర్రాడు గుమ్మం పక్కనే వుంచిన వీఐపీ సూట్‌కేస్‌ని బూటుతో బలంగా తోశాడు శివరాం. గరగర చప్పుడు చేస్తూ వీల్స్‌మీద పరుగెట్టి, మంచానికి ఢీకొని ఆగింది సూట్‌కేస్.

సూట్‌కేసు వెంట పరుగెట్టిన లత చూపులు మళ్ళీ శివరామ్ మొహంమీదికి దూకాయి. ఇంకా తలుపుకే ఆనుక్కున్న శివరాంని ఆమె విశాల నేత్రాలు ఆక్షేపణగా చూశాయి. లిప్‌స్టిక్‌ని మేకప్ సరంజామాలోకి విసిరికొట్టి లత స్టూల్ మీద కూచునే అతనివేపు తిరిగింది.

"పిలిస్తే గానీ దగ్గరకు రాకూడదా?" అందామె కళ్ళతో, కంఠంతో కోపం నటిస్తూ.

శివరాం నవ్వు తెల్లటి పళ్ళని ఆమెకు చూపించింది. "పిలవని పేరంటానికి వెళ్ళి, అదిలించి, అదరగొట్టి తాంబూలాలన్నింటినీ వొళ్ళో పోసుకొచ్చే నన్ను నువ్వు పిలవాలా?"

"తాంబూలం అంటే గుర్తొస్తోంది! దక్షిణ ఎంత?" లత ఉషారుగా అడిగింది.

"లెక్క పెట్టుకున్నం లే!"

"పదా?" లత ఉద్రేకంతో అడిగింది.

"కానీ. పది పైసలు తక్కువైనా మనం పట్టుకోంగా!" శివరాం పొగని రింగులుగా వదిలాడు.

లత లేడిలా గంతేసి, లేచి నించుంది. ఖరీదైన లంగా, ఖరీదైన జాకెట్టులో మణిపురి ఆట బొమ్మలా నించున్న లతని శివరామ్ కళ్ళు మెచ్చుకొంటూ మాశాయి. మెల్లిగా అతను కదిలాడు. లత అతనివేపు కదలబోయింది.

"కానీ. కదలకు. అలాగే వుండు. నేను దగ్గరకు రాగానే వెనక్కి తిరుగు. అద్దంలో నిన్ను చూస్తూ అంతా చెప్తాను!" నవ్వుతూ అన్నాడు.

ఎర్రటి నాలుకతో అతన్ని వెక్కిరిస్తూ లత అద్దంవేపు తిరిగింది. కాసేపట్లో శివరాం ప్రతిబింబం ఆమె ప్రతిబింబం వెనుక ప్రత్యక్షమైంది. ఆమె బాబ్డ్ హెయిర్‌ని సవరిస్తూ అతని రెండు చేతులూ భుజాల మీదికి వాలాయి.

"చెప్పు!" లత ప్రతిబింబం అతని కళ్ళల్లోకి చూస్తూ అంది,

"ఏమిటి?"

"పిలవని పేరంటానికి వెళ్ళే నువ్వు ఈసారి పిలిచిన ఇంటర్వ్యూకు వెళ్ళావ్! ఫోన్ కాల్‌తో నన్ను గోవర్ధన్ అనే మగరాయుడిగా మార్చేశావ్. కథ కొలిక్కి వస్తోందని అప్పుడే అనుకున్నాను...."

"హానీ, కథ కొలిక్కి వచ్చితీరుతుందని నాకు ఎప్పుడో తెలుసు." శివరాం సగర్వంగా అన్నాడు.

"కథ ఎట్లా ప్రారంభమైందో నాకు బొత్తిగా అంతు పట్టడంలేదు. నీకు ఇంటర్వ్యూ ఎలా వచ్చింది?" లత ప్రతిబింబం కళ్ళు చిట్లించింది.

శివరాం చిన్నగా నవ్వాడు. "ఇంటర్వ్యూ శివరాంకు రాలేదు. మహాబలేశ్వర్రావుకు వచ్చింది."

"వాడెవడు?" లత అడ్డు తగిలింది.

"నా కవల కుర్రాడు! లోకంలో బతకాలంటే, ఓపిగ్గా లోటుపాట్లు గమనిస్తూవుండాలి. మన రాష్ట్రంలో బఫెలో ఫెర్టిలైజర్స్ పెద్దసంస్థ. గవర్నమెంటు కాంట్రాక్టరు సిమెంటులో ఇసుక కలిపినట్లు, పాలవాళ్ళు పాలల్లో నీళ్ళు కలిపినట్లు, పత్రికలవాళ్ళు వార్తల్లో ఊహాలు కలిపినట్లు, సినిమావాళ్ళు కథలో బూతులు కలిపినట్లు — రసాయనాల్లో రేగడిమట్టి కలిపి ఫస్టుక్లాసు ఫెర్టిలైజర్ పేరుతో అమాయకులయిన రైతులకు అమ్ముతూ ఆ సంస్థ కోట్లు సంపాదించుకుంది. అడపా దడపా కుర్రాళ్ళకు ఉద్యోగాలిస్తుంది; నామమాత్రం రోజువారీ వేతనంతో. ఏడాదో రెండేళ్ళో గడిచాక, వాళ్ళు రెగ్యులరైజేషన్ అడిగే సమయం వచ్చేసరికి, 'ఉపాధి కల్పన' శాఖలో ట్రెయినింగ్ అయిరమ్మని అదే రోజు కూలీ మీద వాళ్ళని డెప్యూట్

చేస్తుంది ...”

“డార్లింగ్, అర్థం అయ్యీ కాకుండా అవస్థపెట్టే స్తోంది....” లత అడ్డు తగిలింది.

“అడ్డు రాకుండా వింటే అంతా అర్థమవుతుంది ఇది దీర్ఘం అయితే కానీ అసలు కథవ అర్థం వుండదు!” శివ రాం నవ్వుతూ అన్నాడు. “సో, రెండు మూడేళ్ళు అతి తక్కువ జీతంతో పని చేసిన నిస్సహాయుల్ని ట్రెయినింగ్ పేరుతో బైటికి తోసేసి, ఆ సమయంలో పని సాగా లన్న సాకుతో మరి కొంతమంది నిరుద్యోగుల్ని రోజు వారీ జీతాల మీద చాకిరీకి యేర్పాటు చేసుకుం టుంది.... ....”

“అంతేగా? మరేం చేయాలి?” లత సందేహం వెలి బుచ్చింది.

“అంతే అయితే ఫర్వాలేదు. కానీ ఏడాది ట్రెయి నింగ్ పూర్తి చేసుకవచ్చినవాళ్ళని, ఖాళీలు లేవంటూ తిప్పికొట్టేస్తారు. లేకపోతే, సమయం చూసి, పిలిచి రెగ్యులర్ స్కేల్సు ఇస్తామని తగిలేస్తారు....”

“అన్యాయం!”

“ఈ అన్యాయాన్ని బఫెలో ఫెర్టిలైజర్స చాలా యేళ్ళుగా సాగిస్తూ, రెగ్యులర్ స్కేల్స్ వల్ల కలిగే అద నపు ఖర్చును తప్పించుకుంటూ ఎనిమిదిరూపాయల రోజు వారీ జీతం పేరుతో కూలీ ఇచ్చి పనులు చేసుకుంటోంది. ఈ విషయం పేపర్లలో చాలాసార్లు గుప్పుమంది. దీనికంతకీ మూలకారణం బఫెలో మేనేజింగ్ డైరెక్టర్ సత్యసంకల్పం. అంచేత రెండేళ్ళుగా బఫెలో కార్య క్రమాలమీద వోకన్నేసి వుంచాను....”

“అలాగా?”

"ఇప్పుడు ఇంటర్వ్యూలు జరిగిన ఫీల్డుఆఫీసర్స్ ఉద్యోగాల విషయంలో కూడా ఈ అవకతవక జరిగింది. వార్తల్లోకి యెక్కాక పక్కా పోస్టింగ్స్ చేస్తామంటూ దరఖాస్తులు పిలిచారు. ఇంటర్వ్యూలు యేర్పాటు చేశారు. కాన్సిల్ చేశారు. సో మహాబలేశ్వర్రావు పేరుతో నేనూ అప్లై చేశాను...."

"డార్లింగ్, ఆ పేరుతో నీకు సర్టిఫికెట్సు లేవుగా?" లత ఆశ్చర్యపోతూ అడిగింది.

శివరాం చిన్నగా నవ్వాడు. "డబ్బుంటే, డాక్టరేట్లే వస్తాయి! సర్టిఫికెట్లు వో లెక్కా? వివరాలు అడక్కు. అన్నీ సంపాయించాను. ఇంటర్వ్యూ వచ్చింది. ఈసారి జరుగుతుందని కనిపెట్టాను. ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ హెడ్ సహకారాన్ని కొనేశాను. అభ్యర్థుల లిస్టూ, ఇంటర్వ్యూ చేసే పెద్దవాళ్ళ లిస్టూ సంపాయించాను. వాళ్ళందరినీ పరిశీలించాను. బఫెలో ఫెర్టిలైజర్స్ ఇంటర్వ్యూ రోజుకి ముందురోజు ఆ ఎనమండుగురికీ ప్రిలిమినరీ ఇంటర్వ్యూ యేర్పాటుచేశాను...."

"డార్లింగ్...."

"యస్?"

"నువ్వు పెట్టిన ఇంటర్వ్యూకి వాళ్ళెలా వచ్చారు? నీ ఉత్తరాలు వాళ్ళకి అనుమానం...."

"నా ఉత్తరాలా? లేవే!" శివరాం నవ్వాడు.

"డార్లింగ్..." లత చిరాకు నటించింది.

"బఫెలో ఫెర్టిలైజర్స్ లెటర్ హెడ్ మీద ఎస్టాబ్లిష్మెంటు సెక్షన్ గురుడు ప్రాణేశరావు సంతకం చేశాడు...."

"నిజంగా?"

శివరామ్ నవ్వాడు. "అతని సంతకంతో వాళ్ళ లెటర్ హెడ్ వచ్చిందా? దాని ఆధారంతో మ్యాజిక్ ప్రింటర్స్‌లో లెటర్ హెడ్ తయారు చేయించాను. సెక్షన్ హెడ్ సంతకం కిందున్న రబ్బరుస్టాంపుని పచ్చైందు రూపాయల ఖర్చుతో పుట్టించాను. కళ్ళు మూసుకుని అతని సంతకాన్ని గీశాను! సో, ప్రిలిమినరీ ఇంటర్వ్యూ లెటర్స్ పకడ్బందీగా తయారయ్యాయి!"

"మొగాడ్!" లత ఆశ్చర్యంతో అరిచింది.

"నో 'మై శివరామ్' ప్లీజ్!" శివరామ్ నవ్వుతూ అన్నాడు.

"తరవాత!" లత ఉత్కంఠతో ప్రశ్నించింది.

"పాపం ఎనమండుగురూ భయభక్తులతో ఇంటర్వ్యూకు వచ్చారు. హోటల్ లక్స్‌లో వాళ్ళని ఇంటర్వ్యూ చేశాను. ముగ్గురు వీరులు లక్షలాది రూపాయలతో ఉద్యోగాల్ని కొనే ప్రయత్నంలో వున్నారనీ, అడ్వాన్సులు కూడా చెల్లించారనీ తెలుసుకున్నాను ..."

"గుడ్ గాడ్!"

"ఇంటర్వ్యూ బోర్డు మెంబర్‌లలో ఎవరెవరు ఎవరెవరికి అమ్ముడుపోయారో కనుక్కున్నాను. ఆ మెంబర్‌ల చరిత్రల్ని ఒక్క రోజులో కనిపెట్టాను. ఇంటర్వ్యూకి చాలా ఆలస్యంగా హాజరయ్యాను...." శివరాం ఆగి, ఆమెనుండీ దూరంగా జరిగాడు.

లత అద్దంముందునుండీ వెనక్కి తిరిగింది. మంచం మీద కూచున్న శివరాంని మెరిసే కళ్ళతో చూస్తూ నడిచింది. అతనిపక్కనే వాలి, ఆత్రంగా చూసింది. "ఆ తరవాత?"

"ఏముంది? కథ కొలిక్కి వచ్చింది!" శివరాం

నవ్వుతూ అన్నాడు.

లత కోపం అభినయిస్తూ అతని రెండు బుగ్గల్నీ సాగ దీసింది. "నోరు మూసుకుని వివరంగా చెప్పు!"

శివరాం చిరునవ్వుతో చూస్తూ వుండిపోయాడు. లత కళ్ళు పెద్దవి చేసింది.

"కమాన్ డార్లింగ్ చెప్పు!"

"నోరు మూసుకుని చెప్తున్నానుగా? కళ్ళతో చెప్తున్నా" శివరాం నవ్వుతూ అన్నాడు.

లత్న చివాల్న పైకి లేచింది. "ఏడిపిస్తున్నావ్! చీర కట్టుకుని పిరాడు వెళ్ళిపోతా!"

బుంగమూతి పెట్టిన లతని శివరాం మంచంమీదికి లాగాడు. ఆమె మొహంలోకి నవ్వుతూ చూస్తూ ప్రారంభించాడు: "ఇంటర్వ్యూకి వెళ్ళాను. కాస్సేపట్లో నా నిజ స్వరూపం చూపించాను. వాళ్ళాడుతున్న ఇంటర్వ్యూ నాటకాన్ని 'నడివీధి నాటకం'గా మార్చేస్తా నన్నాను. ఒకే ఉద్యోగాన్ని ముగ్గురికీ అమ్మిన మొత్తాన్ని రెండింతలు చేసి కక్కిస్తున్నాను. లేకపోతే అభ్యర్థులందరి చేతా వాళ్ళనే ఇంటర్వ్యూ చేయిస్తానన్నాను. ఇంటర్వ్యూ హాంలో ఇరికించాను. హడిలి చచ్చారు; అడిగింది యిచ్చారు...."

"గుడ్ హెవెన్స్!"

"ఇంకా కొంచెం వుంది! వేలంలో ఉద్యోగాన్ని సొంతం చేసుకోవాలనుకున్న ముగ్గురికీ కాకుండా మరో అభ్యర్థికి—రామసీతారావుకు—ఫీల్డాఫీసర్ ఉద్యోగం ఇప్పించాను!" శివరాం ముగించాడు.

"డార్లింగ్, ఆ ముగ్గురూ కాకుండా అయిదుగురు వచ్చారుగా? అందర్లోకీ ఆ రామసీతారావు—యేమిటో

తిక్క పేరు.—అతనికే ఎందుకు ఇప్పించావ్?" లత సందేహాన్ని వ్యక్తం చేసింది.

"హనీ, చక్కటి ప్రశ్న అడిగావ్!" శివరాం నవ్వుతూ అన్నాడు. "ముందు నేను వాళ్ళందరినీ చక్కగా ఇంటర్వ్యూ చేశాను. రామసీతారావే తగిన వ్యక్తి అని నిర్ణయించాను...."

"ఎలా?"

"డబ్బుతో ఉద్యోగాన్ని కొనే దుర్మార్గ ప్రయత్నం చేసిన ముగ్గురినీ మొట్టమొదటే ఒక గ్రూప్ కిందికి చేర్చి, కొట్టిపారేశాను. పోతే ఇంకా అయిదుగురున్నారు. వాళ్ళలో ఒకతను యేదో చిన్న కంపెనీలో రికార్డు అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు. అంటే అతనికి ఈ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం రాకపోయినా బతగ్గలడు. రెండో అతను యేదో కాన్వెంటులో టీచరుగా వున్నాడు. అతను అక్కడే కంటిన్యూ అయితే మరేం నష్టంలేదు. మూడో అతను వృద్ధిలోకి వచ్చేస్తున్న కథా రచయిత. తెలుగులో ప్రస్తుతం బోల్డన్ని పత్రికలున్నాయి. అన్నింటికీ కథలు కావాలి. కథలకి డిమాండ్ వుంది. రచయితగా సమాజాన్ని మార్చివేయాలన్న ఆవేశాన్ని అతను వ్యక్తం చేశాడు. అంత ఆవేశాన్ని ఉద్యోగం గొలుసుల్లో బంధించరాదు! సో, అతనూ పోయాడు. ఇక నాలుగో వ్యక్తి ఆర్టిస్టు. బొమ్మలూ, కార్టూన్లూ, సైన్ బోర్డులూ వగైరా పనులు చేస్తాడు. అదో ఎక్స్‌ట్రా క్వాలిఫికేషన్ గా, రచయితలాగే—అతనూ చెప్పుకున్నాడు...."

శివరామ్ ఆగి మరో సిగరెట్ వెలిగించాడు. లత అతనేసి చూస్తూ, కథ చెప్పమని చూపుల్తోనే తొందర

పెడుతోంది.

“ఇక పోతే, మిగిలిన వ్యక్తి రామసీతారావు. అతను మామూలు మనిషి. అందరికీ వున్న క్వాలిఫికేషన్ వుంది. ఇతర వ్యాపకాల్లో ఇమడలేకపోయాడు. ఏ పనీ లేదు. అయితే కడుపువుంది. ఆధారపడిన సంసారం వుంది. డబ్బిచ్చి ఉద్యోగం కొనేవాళ్ళు, ఆ డబ్బుతో యేదో వ్యాపారం చేసుకోవచ్చు. టీచరు టీచరుగా వుంటే తప్పులేదు. గుమాస్తా గుమాస్తాగానే వుండొచ్చు. ఇక రచయితా, ఆర్టిస్టూ—వాళ్ళు లోకానికి కావాలి. ఆ కళల్లో వాళ్ళు సమాజానికి ఉపయోగపడే అవకాశం వుంది. ఇలా ఆలోచించి, ఎనిమిదిమందిని ఒక్కడికి తగ్గించాను!”

“ఎక్సలెంట్! డార్లింగ్, యూ ఆర్ గ్రేట్!” లత వుద్రేకంతో అరిచింది. రెండు చేతులనీ అతని భుజాల చుట్టూ వేయబోతూ యేదో గుర్తొచ్చి ఆగింది.

“డార్లింగ్ ....”

“యస్, హనీ?”

“వాళ్ళు.... పోలీసుల దగ్గరకు వెళ్ళరూ?”

సిగరెట్ పీకని గదిమూలకు విసిరి శివరాం పకపకా నవ్వాడు. “వెళ్ళరు. ఎందుకంటే వెళ్ళలేరు! ఎందుకంటే, వెళ్తే నా గురించి చెప్పాలి. నా గురించి చెప్పాలంటే తమ గురించీ వాళ్ళు చెప్పుకోవాలి! వాళ్ళు చెప్పుకోకపోతే నేను చెప్తాను!”

“ఫర్వాలేదంటావా?” లత మళ్ళీ సందేహించింది.

“హనీ, చీర కట్టుకో. పోలీసుల పేరెత్తి ముఖ్యమైన పని గుర్తుచేశావ్. అతనితో మాట్లాడాలి....”

“ఎవరతను?”

109

"మనం యే అడ్వెంచర్ చేసినా అతనికి తెలియ చేయాలి. లేకపోతే అతను బాధపడతాడు!"

"డార్లింగ్ ...."

"కమాన్. చీర! ఈలోగా ఫోన్‌లో అతనితో మాట్లాడతాను...."

"డార్లింగ్ ....అతను .. అతను" లత ఆలోచిస్తూ అంది.

"అతనే; డిటెక్టివ్ టెంపో...." శివరామ్ రిసీవర్‌ని అందుకుని సిగరెట్ ముట్టించాడు.

('శివరామ్ అడ్వెంచర్స్' సీరీస్‌లో
ఇది మూడవ నవల.)